

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 8 | విజయవాడ, మంగళవారం 8 ఆగస్టు 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 8 August 2023 | Rs





ఎకరాకు రూ.10 వేలు సాగు సాయం

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రుణభారంతో కుంగిపోతున్న రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఎకరాకూ సాగు సాయంగా రూ.10 వేలు అందించాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలో ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘాల ఆధ్వర్యాన రైతులకు సాగు సాయం కింద ప్రతి ఎకరాకూ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా జరిగింది. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరలు లభ్యం కాక ప్రతియేటా నష్టపోతున్నారని అన్నారు. విపత్తులు వచ్చినప్పుడు జరిగే నష్టానికి సరైన పరిహారాన్ని కూడా పాలకులు అందించకపోవడం తగదన్నారు. రాష్ట్రంలో రైతులు, కౌలురైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక సమగ్ర విధానాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆలిండియా కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయం పట్ల చూపుతున్న నిరాధారణతో ప్రతిరైతూ సగటున రూ.2.45 లక్షల రుణభారంతో వున్నారని అన్నారు. దేశంలో రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానంలో రాష్ట్రం వుందన్నారు. తక్షణం స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతుల రుణాలను మాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జమలయ్య, సిపిఐ రాష్ట్ర నాయకులు అక్కినేని వనజ, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్, రైతు సంఘం నాయకులు కె రామాంజనేయులు తదితరులు మాట్లాడారు.

కర్నూలు జిల్లాను సస్యశ్యామలం చేయాలి

- ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం
- సిపిఎం మహాధర్నాలో బివి రాఘవులు



కర్నూలులో మహాప్రదర్శన అగ్రభాగాన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శిదేశాయి , ఇతర నాయకులు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాను సస్యశ్యామలం చేసే వరకూ పోరాటం సాగిస్తామని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు తేల్చి చెప్పారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన మహాపాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట జరిగిన మహాధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్య, వైద్యం, నీటిపారుదల, పారిశ్రామిక రంగాల్లో కర్నూలు జిల్లా పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. గతంలోనూ సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్రలు జరిగాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కొన్ని ప్రాజెక్టులకు పాలకులు శంకుస్థాపన చేసినా వాటిని పూర్తి చేయలేదని, వాటి పునాది రాళ్లు కూడా కనిపించకుండాపోయాయని అన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నా జిల్లాకు ఒరిగిందేమీలేదని విమర్శించారు. అటువంటి మంత్రి ఎందుకని, రాజీనామా చేసి కూర్చోవాలని అన్నారు. గుండ్రేవుల, వేదవతి నీళ్లు వస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. వెనుకబడిన రాయలసీమకు మొదట నీళ్లు ఇవ్వాలని గతం నుంచీ కోరుతున్నామని, పాలకులు పట్టించుకోవడంలేదని అన్నారు. రాయలసీమ వాళ్లు ముఖ్యమంత్రులు అవుతున్నా రాయలసీమ ప్రజలకు ఎటువంటి ప్రయోజనమూ కలగడం లేదని తెలిపారు. కర్నూలు జిల్లా అభివృద్ధి కావాలంటే ప్రాజెక్టులను నిర్మించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ గురించి ఎంపిలు, ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.కర్నూలు పశ్చిమప్రాంత అభివృద్ధికి జిల్లా కలెక్టర్ జి.సృజన ఒక ప్రణాళిక తయారు చేసి ముఖ్యమంత్రి జగన్‌కు పంపామని పత్రికల్లో వచ్చిందన్నారు. కనీసం మీ కలెక్టర్ చేసిన ప్రతిపాదనలనైనా అమలు చేయాలని సిఎంని రాఘవులు కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లా అన్ని రంగాల్లో అత్యంత వెనుకబడి ఉందని, భూకబ్జాల్లో మాత్రం ముందుందని తెలిపారు. అక్రమ వ్యాపారాలకు వైసిపి ఎమ్మెల్యేలు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్నారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగానూ, ముఖ్యమంత్రిగానూ కర్నూలు జిల్లాకు ఇచ్చిన హామీలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి గతంలో టిడిపి, ఇప్పుడు వైసిపి జిల్లాకు చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులను కోరారు. మహాధర్నాకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప మద్దతు తెలిపి మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, కెవి.నారాయణ, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, పి.నిర్మల, వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

మహాప్రదర్శన సాగిందిలా....

జిల్లా సమగ్రాభివృద్ధికి ఈ నెల 2న ఆదోనిలో ప్రారంభమైన సిపిఎం మహా పాదయాత్ర సోమవారం కర్నూలుకు చేరుకుంది. ఈ పాదయాత్ర బృందానికి పెద్ద ఎత్తున సిపిఎం శ్రేణులు, ఇతర సంఘాల నాయకులు ఎక్కడికక్కడే ఘనంగా స్వాగతం పలికాయి. వివిధ తరగతుల ప్రజలు తమ సమస్యలను సిపిఎం బృందానికి విన్నవించుకున్నాయి. పెద్దపాడు సమీపంలోని తాజ్ ఫంక్షన్ హాలు నుండి సిపిఎం మహా పాదయాత్ర బృందం బళ్లారి చౌరస్తాకు చేరుకుంది. అక్కడ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన సాగింది. ప్రదర్శన అగ్రభాగాన పిఎన్‌ఎం కళాకారులు, డప్పు కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నిరాశపరచిన సిఎం వరద ప్రాంతాల పర్యటన

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం, ఏలూరు జిల్లా కుక్కునూరులో ముఖ్యమంత్రి వరద ప్రాంతాల పర్యటన నిరాశపరిచిందని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ప్రసంగం మొత్తం సిఎం గతంలో చెప్పిన విషయాలనే మరలా ప్రస్తావించారు తప్ప కొత్తదనమేదీ లేదని విమర్శించారు. 41.5 కాంటూరు వద్ద అదనంగా 32 గ్రామాలను మొదట ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద చేరుస్తున్నామని చెబుతున్నారని, గత సంవత్సరం వరదల్లో 37 మీటర్లకే 193 గ్రామాలు మునిగాయని ప్రజలు ఎంత ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చెవికెక్కడం లేదని పేర్కొన్నారు. 41.5 మీటర్ల ఎత్తు వరకు మునిగే గ్రామాలదే తన బాధ్యత అని చెబుతున్న ముఖ్యమంత్రి 41 మీటర్లలోపు మునిగిన గ్రామాల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. గత సంవత్సరం వచ్చిన వరదలకు పునరావాస కాలనీలే మునిగిపోయాయనే అంశం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియదా? అని ప్రశ్నించారు. తప్పుల తడకల కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 1986, 2022 వరదల ఆధారంగా పునరావాసం కల్పించాలని కోరారు. కాంటూరు లెక్కలే తప్పని లిడార్ సర్వే రుజువు చేసిందని, వరదల ఆధారంగా తిరిగి పరిశీలన చేసి అన్ని మునక గ్రామాలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. డ్యాం నిర్మాణం కోసం ఉదారంగా నిధులిస్తున్న ప్రభుత్వాలు నిర్వాసితులకు ఎందుకు ఇవ్వరని, కాంట్రాక్టర్లకు ఒకచట్టం, నిర్వాసితులకు మరోచట్టం ఉందా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అనేక మందిని గృహ నిర్బంధంలో ఉంచి ఎంపిక చేయబడిన వారిని సభకు తరలించి చప్పట్లు కొట్టించుకోవడం అవమానకరమని అన్నారు. వరద వచ్చిన ప్రాంతాల్లో అరకొర సౌకర్యాలు కల్పించి, అధికారులను వెన్నుతట్టడానికి వచ్చానని చెప్పడం దుస్సాహసమని, నిధులివ్వకుండా అధికారులు ఏంచేయగలరో సిఎం చెప్పాలని అన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతను అధికారుల మీదకు నెట్టివేయాలని చూడడం క్షంతవ్యం కాదని వివరించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకుని న్యాయమైన సహాయం ప్రజలకు అందేలా చూడాలని రాష్ట్ర కమిటీ కోరింది.



విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు
- వివిధ పార్టీల ఎంపిలకు వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు కమిటీ నేతలు ఢిల్లీలోని వివిధ పార్టీల నేతలను కలిశారు. సిపిఎం రాజ్యసభ ఎంపి వి శివదాసన్‌కు వినతి అందజేశారు. అలాగే ఆప్ ఎంపి సంజయ్ సింగ్‌ను, జెడియు కేంద్ర కార్యదర్శి మహ్మద్ నిసార్‌ను కలిసి వినతి అందజేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన జరిగే ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. మంగళవారం కేంద్ర ఉక్కుశాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియాను కలిసి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని చర్చిస్తామన్నారు. 910 రోజులుగా పోరాడుతున్నామని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం నిరంకుశత్వానికి నిదర్శనమని విమర్శించారు. ఇది తెలుగు ప్రజలపై జరుగుతున్న దాడి మాత్రమే కాదని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంటుకు కావాల్సిన ఇనుప గనులు కేటాయించాలని, వడ్డీలు, జిఎస్‌టి మూడేళ్లపాటు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. గంగవరం అదానీ పోర్టును విశాఖ ఉక్కుకు అప్పగించాలని, పూర్తిస్థాయి సామర్థ్యంతో కంపెనీని నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు. వంద శాతం ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని కోరారు. ఎంపిలను కలిసిన వారిలో పోరాట కమిటీ నేతలు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె అయోధ్యారామ్, వరసాల శ్రీనివాసరావు, జెర్రిపోతుల ముత్యాలు, డివి రమణారెడ్డి, కరణం సురేష్ కుమార్ ఉన్నారు.

విద్యుత్ కార్మికుల ధర్నా ఉద్రిక్తం

- తిరుపతి డిస్కమ్ వద్ద అడ్డుకున్న పోలీసులు
- మాజీ ఎంపి మధు సహా 26 మంది అరెస్టు, విడుదల
- 10 నుంచి నిరవధిక సమ్మెలోకి :పోరాట కమిటి



డిస్కం కార్యాలయం ఎదుట భారీ ధర్నా



మాజీ ఎంపి మధును అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ/విజయవాడ

తిరుపతి లక్ష్మీపురం సర్కిల్‌లో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన పోలీసుల జోక్యంతో ఉద్రిక్తతకు దారితీసింది. సిఎం హామీ మేరకు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, 45 శాతం ఫిట్‌మెంట్, మూడు వెయిటేజీలతో కూడిన పిఆర్‌సిని శాశ్వత ఉద్యోగులకు ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, కారుణ్య నియామకాల్లో అడ్డగోలు నిబంధనలను రద్దు చేయాలని, 2022 ఆధారంగా పిఆర్‌సి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ కార్మికులు సోమవారం మహాధర్నా చేపట్టారు. పోలీసుల ఆంక్షలను లక్ష్యపెట్టకుండా డిస్కమ్ పరిధిలోని జిల్లాల నుంచి వేలాది మంది కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తిరుపతికి చేరుకున్నారు.

కార్మికులను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. కార్మికులకు మద్దతు తెలిపేందుకు వచ్చిన సిపిఎం మాజీ ఎంపి పెనుమల్లి మధు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి సహా 26 మందిని అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను పరి ష్కరించని పక్షంలో ఆగస్టు 10 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు హెచ్చరించారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ కార్మికులు లక్ష్మీపురం సర్కిల్ వద్దకు ఎర్రజెండాలతో భారీగా చేరుకుని ధర్నా నిర్వహించారు. ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నానుద్దేశించి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాట కమిటీ చైర్మన్ సుదర్శన్ రెడ్డి ప్రసంగిస్తూ.. ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకు దిగొచ్చిన అధికారులతో నేతలతో చర్చించారు. కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సమస్యలు పరిష్కరించండి సామూహిక నిరసన దీక్ష

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ల పోరాట కమిటీ, విజయవాడ సర్కిల్ రీజనల్ కమిటీ ఆధ్వర్యాన విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ అధ్యక్షులు ఎల్‌రాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నాగరాజు, సర్వేశ్వరరావు, శ్రీనివాస్, కిరణ్, జగన్, మణిపాల్ దీక్షల్లో కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం విడనాడి వారి న్యాయమైన డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కళాధర్, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.



కారంపూడి సభలో ప్రసంగిస్తున్న నారా లోకేష్

పోలవరంపై పులిహోర కబుర్లు : లోకేష్

- బాబు హయాంలో నీరు పారితే.. జగన్ రక్తం పారిస్తున్నారు
- పల్నాడు జిల్లాలో కొనసాగుతున్న పాదయాత్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టుపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పులిహోర కబుర్లు చెబుతున్నారని, నాలుగేళ్లలో ఒక అంగుళం పనులు జరగలేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర సోమవారం పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో సాగింది. ఈ సందర్భంగా కారంపూడిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ప్రాజెక్టులు కట్టి ప్రజలకు సాగునీరు పారిస్తే.. జగన్ కక్ష సాధింపు రాజకీయాలతో గ్రామాల్లో రక్తం పారిస్తున్నారని అన్నారు. ఒక్క ప్రాజెక్టు కూడా కట్టడం చేతకాని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. చిత్తూరు ఎస్‌పి రిషాంత్ రెడ్డి వైసిపి కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతపై అధికారపార్టీ నేతలు రాళ్ల దాడి చేసినా ఎస్‌పికి కనబడలేదని, మరో తొమ్మిది నెలల తరువాత ఎస్‌పి కళ్లకు ఆపరేషన్ చేయిస్తానని అన్నారు. రిషాంత్ రెడ్డి ఐపిఎస్‌కు అర్హుడుకాదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో ఎస్‌సిలకు ఉన్న 27 సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. బిసిల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని స్పష్టం చేశారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని లోకేష్ విమర్శించారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి వచ్చే గ్రానైట్ లారీలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాలంటే పిన్నెల్లి బ్రదర్స్‌కు లారీకి రూ.23 వేల చొప్పున పన్నుకట్టాలని, రోజుకు 200 లారీల నుంచి 46 లక్షల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. నాలుగేళ్లలో రూ.700 కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. మాచర్లలో ఎవరైనా అపార్ట్‌మెంట్ కట్టాలంటే ఎమ్మెల్యేకి రూ.20 లక్షలు కప్పం కట్టాలని విమర్శించారు.

ఎన్‌జిఒ నేతలకు 3 రోజుల ప్రత్యేక సెలవు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌జిఒ) 21వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 21 నుంచి 23 వరకు విజయవాడలో జరగనున్నాయి. ఇందుకోసం సమావేశాలకు హాజరయ్యే ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, జిల్లా అధ్యక్షులు/జిల్లా కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ మెంబర్లు, తాలూకా అధ్యక్షులు, కార్యదర్శులకు మూడు రోజులు స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జిఓ 1570ను విడుదల చేసింది. విజయవాడలో ఈ నెల 20న పబ్లిక్ హాలిడేను పొందేందుకు, మూడు రోజులు ఆఫీసు విడిచిపెట్టేందుకు అనుమతినిచ్చినట్లు జిఓలో పేర్కొంది. సంబంధిత శాఖలకు ఆఫీస్ బేరర్లు/ఎగ్జిక్యూటివ్ సభ్యులు/ప్రతినిధులు, పరిశీలకులు జాబితాను అసోసియేషన్ సమర్పించాలని, సంబంధిత జిల్లా అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటారని జిఓలో తెలిపింది.

మహిళలపై హింసను నిరోధించండి

- మహిళా పోరుయాత్ర నేటితో ముగింపు
- బహిరంగ సభకు హాజరు కానున్న బృందాకరత్



గుంటూరులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి - యంత్రాంగం

మహిళలు, బాలికలు, చిన్నారులపై రోజురోజుకు పెరిగిపోతున్న అత్యాచారాలు, హింసను నిరోధించాలని, మద్యాన్ని, అశ్లీల సాహిత్యాన్ని నియంత్రించాలని ఐద్వా నేతలు డిమాండ్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రారంభమైన 'మహిళా పోరుయాత్ర' సోమవారం గుంటూరు, పల్నాడులో, విశాఖపట్నం నుంచి ప్రారంభమైన యాత్ర విజయవాడలో కొనసాగింది. విజయవాడ దుర్గాపురంలో ప్రారంభమైన యాత్ర ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల, భానూనగర్, మధురానగర్ (కొబ్బరితోట), శారదా కళాశాల, సింగ్‌నగర్ 58వ డివిజన్, లూనా సెంటర్, వాంబే కాలనీ, కండ్రిక, రాజీవ్‌నగర్, ఆర్‌ఆర్ పేటలో కొనసాగింది. ఆయా సెంటర్లలో నిర్వహించిన సభల్లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ.. మోడీ హయాంలో మహిళలు, బాలికలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, హత్యలు నానాటికీ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మద్యం నియంత్రణ చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి, నాలుగేళ్లు అయినప్పటికీ నియంత్రణ చేయలేదని విమర్శించారు. మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని అన్నారు. ఐద్వా ఉపాధ్యక్షులు పూర్ణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో యాత్ర కొనసాగింది. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన సభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హింసను అధ్యయనం చేయడానికి తక్షణమే కమిషన్ నియమించాలని కోరారు. కమిషన్ సిఫార్సుల మేరకు హింసను నివారించడానికి మహిళా సంఘాల సూచనలు తీసుకొని విధివిధానాలు రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిలకలూరిపేటలో నిర్వహించిన సభలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ.. మణిపూర్ ఘటన దేశ ప్రజలను, ప్రపంచ ప్రజలను సిగ్గుపడేలా చేసిందన్నారు. ప్రధాని ఇప్పటికీ ఆ ఘటనపై పార్లమెంట్‌లో నోరుమెదపకపోవడం దారుణమన్నారు. విజ్ఞాన మందిరంలో నిర్వహించిన సభలో మహిళల సమస్యల మీద ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు డి శ్రీనివాసకుమారి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలపై 21న రాష్ట్ర వ్యాప్త ధర్నాలు : ఎన్‌పిఆర్‌డి

ప్రజాశక్తి - విజయవాడ : వికలాంగుల పింఛను మొత్తాన్ని రూ.6 వేలకు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర కమిటీ తెలిపింది. పెద్ద సంఖ్యలో వికలాంగులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఎం.అడివయ్య మాట్లాడుతూ వికలాంగుల చట్టం - 2016ను ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయడం లేదన్నారు. దేశంలో నానాటికీ వికలాంగులపై దాడులు పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వేల్లో వికలాంగుల సౌకర్యాలను కుదించడంపై మండిపడ్డారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్క వికలాంగునికీ మోటారు వాహనాలు అందజేయాలని కోరారు. టిడ్కో, జగనన్న గృహాల కేటాయింపుల్లో వికలాంగుల రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వివాహ ప్రోత్సాహకాలను కొంతకాలంగా చెల్లించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా బకాయి నిధులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రామయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బుగిడి నూకప్పారావు, పాల వెంకయ్య, సుభాషిణి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అన్ని జిల్లాల్లో ఉచిత స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలి

- డివైఎఫ్ఐ విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి అన్ని జిల్లాల్లో ఉచిత స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న కోరారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టరు శ్రీనివాస్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నిరుద్యోగులు లక్షలు వెచ్చించి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెచ్చిన డబ్బులకు వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సాంఘిక, బిసి సంక్షేమ, మైనార్టీ శాఖలు కలిసి ప్రతి జిల్లాలో ఉచిత స్టడీ సర్కిల్స్ నిర్వహించాలని కోరారు. హాస్టళ్ల వసతితోపాటు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలని అన్నారు. ఇప్పటికే అనేక మంది నిరుద్యోగులు డబ్బులు లేక పోటీ పరీక్షలకు దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమశాఖ మూడు ప్రాంతాల్లో స్టడీ సర్కిల్స్ నిర్వహించేందుకు ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో సివిల్ సర్వీసెస్, విజయవాడలో గ్రూప్-1, తిరుపతిలో గ్రూప్-2 ఉచిత స్టడీ సర్కిల్ ఉపయోగించుకునేందుకు గడువు ఆగస్టు 5 వరకు విధించారని తెలిపారు. దీనివల్ల చాలా మంది నిరుద్యోగులు నమోదు చేసుకోలేదని మరోవారం రోజులు పొడిగించాలని కోరారు. వినతి అందజేసిన వారిలో ఆ సంఘం నాయకులు గణేష్, ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

'విద్యుత్' చర్చలు విఫలం

- నేటి జెఎసి 'చలో విద్యుత్ సౌధ' రద్దు
- 10 నుంచి సమ్మె

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఉద్యోగులతో విద్యుత్ సంస్థల అధికారులు జరిపిన చర్చలు మరోసారి విఫలమయ్యాయి. ఉద్యోగుల డిమాండ్లపై ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జెన్ ఎండి కెవిఎన్ చక్రధర్ బాబు, ఎపిసిపిడిసిఎల్ సిఎండి జె పద్మజనార్దన్ రెడ్డి సోమవారం విద్యుత్ సౌదలో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో కూడా ఎలాంటి పురోగతి లేదు.

పిఆర్‌సి ఫిట్‌మెంట్ 7 శాతానికి మించి ఇచ్చేది లేదని అధికారులు జెఎసి నాయకులతో స్పష్టం చేశారు. దీనిపై చివరి అభిప్రాయం మాత్రమే చెప్పాలని జెఎసి నాయకులకు చెప్పారు. ప్రభుత్వం ఇంతకంటే ప్రభుత్వం ముందుకెళ్లే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఫిట్‌మెంట్ కనీసం 10శాతం ఉండాలని జెఎసి నాయకులు పట్టుబట్టారు. దీంతో ఇద్దరి మధ్య అంగీకారం రాలేదు. యాజమాన్యం, పోలీస్ శాఖ విజ్ఞప్తి మేరకు మంగళవారం పిలుపునిచ్చిన మహాధర్నా కార్యక్రమాన్ని విరమించుకున్నట్లు ఉద్యోగుల జెఎసి చైర్మన్ పి చంద్రశేఖర్ విద్యుత్ సౌధ వద్ద సమావేశం అనంతరం మీడియాతో చెప్పారు. ధర్నా కార్యక్రమాన్ని వర్క్ టు రూల్ కార్యక్రమంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగులందరూ ఇదే పాటించాలని పిలుపునిచ్చారు. ఏవరూ కూడా మంగళవార విద్యుత్ సౌద వద్దకు రావొద్దని తెలిపారు. ప్రభుత్వాన్ని, వినియోగదారులను ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమకు లేదన్నారు.న్యాయమైన కోర్కెలపై ముఖ్యమంత్రి స్పందించి పరిష్కరించాలని ఆశించారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 10వ తేది నుంచి సమ్మెకు వెళ్తామని చెప్పారు. దీనికి ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో ప్రతి ఉద్యోగి, కార్మికుడు భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ సమావేశంలో జెఎసి సెక్రటరీ పి ప్రతాప్ రెడ్డి, కన్వీనర్ బి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 8 | విజయవాడ, మంగళవారం 8 ఆగస్టు 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 8 August 2023 | Rs



మణిపూర్‌లో మానవతా చర్యల పర్యవేక్షణకు

ముగ్గురు మహిళా న్యాయమూర్తులతో కమిటీ

- ప్రకటించిన సుప్రీం

న్యూఢిల్లీ : హింసాకాండతో అట్టుడుకుతున్న మణిపూర్‌కు స్వస్థత చేకూర్చడం, సహాయక చర్యలు, పునరావాసం, నష్టపరిహారం తదితర అంశాలను పర్యవేక్షించేందుకు ముగ్గురు మహిళా న్యాయమూర్తులతో ఒక కమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తులైన జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ షాలిని పన్సాల్కర్ జోషి, జస్టిస్ ఆశా మీనన్‌లతో కమిటీ ఏర్పాటును ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ సోమవారం ప్రకటించారు. జస్టిస్ మిట్టల్ జమ్ము కాశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కాగా, జస్టిస్ జోషి బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్ మీనన్ ఢిల్లీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి. మణిపూర్ హింస సందర్భంగా నమోదైన కేసుల సమగ్ర దర్యాప్తును పర్యవేక్షించేందుకు మహారాష్ట్ర సీనియర్ ఐపిఎస్ అధికారి దత్తాత్రేయ పద్సాల్గికర్‌ను నియమిస్తామని సుప్రీం సూచనప్రాయంగా తెలిపింది. ఆయన ఎన్‌ఐఎ, ఐబి, నాగాలాండ్‌ల్లో పనిచేశారు. మణిపూర్‌లో మే నుంచి జులై వరకు 6,500కి పైగా ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ కేసుల దర్యాప్తునకు 42 సిట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు మణిపూర్ ప్రభుత్వం తెలిపింది. ఒక్కొక్కరు ఆరు సిట్‌ల పనితీరును పర్యవేక్షించేందుకు ఆరుగురు డిఐజి ర్యాంక్ అధికారులను నియమించాల్సిందిగా ఆరు ఇతర రాష్ట్రాల డిజిపిలను ఆదేశించనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. మహిళలపై నమోదైన 11 ఎఫ్‌ఐఆర్‌లను సిబిఐకి బదిలీ చేసినట్లు కోర్టు పేర్కొంది. ఇతర రాష్ట్రాలకు చెందిన ఐదుగురు డిప్యూటీ ఎస్‌పి, ఎస్‌పి స్థాయి అధికారులు సిబిఐలో భాగంగా వుంటారని తెలిపింది. వారిని ఆయా రాష్ట్రాల డిజిపిలు నామినేట్ చేస్తారు. సిబిఐ జాయింట్ డైరెక్టర్ పర్యవేక్షణ కింద వీరు దర్యాప్తును చేపడతారు.



నిర్వాసితుల ధర్నాలో ప్రసంగిస్తున్న బృందాకరత్ (ఇన్‌సెట్‌లో) విల్లంబులతో సీతారాం ఏచూరి, వి.శ్రీనివాసరావు తదితరులు

పోలవరం జాతీయ సమస్య

- పరిహారం, పునరావాసం కేంద్రానిదే బాధ్యత
- అది పూర్తి కాకపోతే.. ప్రాజెక్టు కొనసాగదు
- ప్రధాని మోడీకి సిఎం జగన్ ఆత్మ సమర్పణ
- నిర్వాసితుల ధర్నాలో సీతారాం ఏచూరి

వివరాలు లోపల పేజీలో



వరద బాధితురాలి సమస్యను వింటున్న సిఎం జగన్

కేంద్రం నిధులిస్తేనే...

నిర్వాసితులకు పరిహారం అన్న సిఎం

- 2025 ఖరీఫ్‌కు పోలవరం పూర్తి
- లైడార్ సర్వే ఫైనల్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి, కూనవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

'పోలవరం నిర్వాసితులకు న్యాయం చేసేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాం. కేంద్రం ఈ నెలాఖరుకు నిధుల విడుదలపై సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నాం. త్వరలో అందరికీ మేలు జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వపరంగా నిర్వాసితులకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తాం. కేంద్ర ప్రభుత్వం నిధులిస్తే తప్ప పరిహారం ఇవ్వలేం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గతంలో మొదటి దశలో నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పిన సిఎం జగన్... ప్రస్తుతం దానికి విరుద్ధంగా మాట్లాడారు. వరద బాధితులను పరామర్శించేందుకు ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం, అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం గ్రామాలకు సోమవారం ఆయన వచ్చారు. వరద బాధితులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. వరదల సమయంలో ప్రభుత్వం నుంచి సహాయం అందిందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిగతా 7లో

నిరాశపరచిన సిఎం వరద ప్రాంతాల పర్యటన

- సిపిఎం రాష్ట్ర కమిటీ

లోపలి పేజీలో..

కర్నూలు జిల్లాను సస్యశామలం చేయాలి

- సిపిఎం మహాధర్నాలో బివి రాఘవులు

రాహుల్ గాంధీపై

అనర్హత వేటు ఎత్తివేత



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాహుల్ గాంధీ

- పార్లమెంట్‌కు హాజరు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తిరిగి వయనాడ్ ఎంపిగా కొనసాగనున్నారు. ఎంపిగా ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని లోక్‌సభ సచివాలయం పునరుద్ధరించింది. ఈ మేరకు సోమవారం లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. 'మోడీ ఇంటి పేరు' కేసులో గుజరాత్ కోర్టు ఇచ్చిన రెండేళ్ల జైలుశిక్ష తీర్పుపై ఆగస్టు 4న సుప్రీంకోర్టు స్టే విధించింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాహుల్‌పై అనర్హత ఆదేశాలను నిలుపుదల చేస్తున్నట్లు లోక్‌సభ సచివాలయం స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఆయన ఎంపిగా కొనసాగుతారని స్పష్టం చేసింది. ఈ మేరకు రాహుల్ గాంధీకి లోక్‌సభ సచివాలయం సమాచారం అందించింది. దీంతో రాహుల్ దాదాపు నాలుగు నెలల తరువాత పార్లమెంటుకు వచ్చారు. ఈ సందర్భంగా పార్లమెంటు ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం భవనంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌తోపాటు వివిధ పార్టీల ఎంపిలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పార్లమెంటులోకి సాదరంగా ఆహ్వానం పలికారు. అవిశ్వాస తీర్మానంపై చర్చను రాహుల్ గాంధీ ప్రారంభించనున్నారు.

నుహ్‌లో ఇళ్ల కూల్చివేత నిలిపివేత

- హైకోర్టు ఆదేశాలు

గురుగావ్‌లో దర్గాకు నిప్పు

గురుగావ్ : హర్యానాలోని నుహ్ జిల్లాలో కొనసాగుతున్న ఇళ్ల కూల్చివేత క్రమాన్ని తక్షణమే నిలిపివేయాల్సిందిగా పంజాబ్, హర్యానా హైకోర్టు సోమవారం ఆదేశించింది. గత వారంలో నుహ్‌లో మతఘర్షణలు చెలరేగిన నేపథ్యంలో అధికారులు అక్కడ అక్రమంగా భవనాలు నిర్మించారంటూ పలువురు ముస్లిముల భవనాల కూల్చివేతను చేపట్టారు. నుహ్‌లో సాగుతున్న చర్యలను తనకు తానుగా పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ జి.ఎస్.సంధావాలియా పై ఆదేశాలు జారీ చేశారు. ఇకపై ఎలాంటి భవనాల కూల్చివేత చర్యలను చేపట్టరాదంటూ హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించారు. జులై 31న విహెచ్‌పి ప్రదర్శనపై రాళ్లు రువ్విన వారు నివసిస్తున్న భవనాలు ఇందులో కొన్ని వున్నాయని అధికారులు చెబుతున్నారు. ఆనాటి అల్లర్లు పొరుగున ఉన్న గురుగావ్‌కు కూడా విస్తరించాయి. ఇక్కడి దర్గాకు సోమవారం తెల్లవారుజామున ఐదారుగురు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని దర్గా సంరక్షకుడు ఘసిటె రామ్ తెలిపారు. ప్రజల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చామని, ప్రార్థనా వస్తువులు కాలిపోయాయని చెప్పారు. అన్ని మతాల వారు ఇక్కడకు వస్తారని అన్నారు.

రాజ్యసభలో ఢిల్లీ బిల్లు ఆమోదం

- అనుకూలం 131, వ్యతిరేకం 102
- మొరాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్
- చిట్టీలతో ఓటింగ్ ప్రక్రియ
- వైసిపి మద్దతు, టిడిపి డుమ్మా



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభలో ఢిల్లీ పౌరసేవల బిల్లు ఆమోదం పొందింది. బిల్లుపై ఓటింగ్ జరగ్గా, బిల్లుకు అనుకూలంగా 131, వ్యతిరేకంగా 102 ఓట్లు వచ్చాయి. రాష్ట్రానికి చెందిన వైసిపి బిజెపికి అనుకూలంగా ఓట్లు వేసింది. టిడిపి మాత్రం చర్చలో పాల్గొనలేదు. ఓటింగుకు డుమ్మా కొట్టింది. బిజెడి, బిఎస్‌పి కూడా బిజెపికి అనుకూలంగా నిలిచాయి. దీంతో బిల్లు ఆమోదం పొందినట్లు డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ప్రకటించారు. అంతకముందు మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించినట్లు డిప్యూటీ ఛైర్మన్ తెలిపారు. దీనికి ప్రతిపక్షాలు నిరసన తెలుపుతూ డివిజన్ కోసం పట్టుబట్టాయి. దీంతో ఓటింగ్ నిర్వహించారు. ఢిల్లీ సీనియర్ ప్రభుత్వ అధికారుల నియామకాలు, బదిలీలకు సంబంధించిన అధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నరుకు అప్పగించే ఆర్డినెన్స్ స్థానంలో ఢిల్లీ సర్వీసుల బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ జరిగింది. ఢిల్లీ సర్వీసుల బిల్లును ఏం చేసైనా సరే సాధించాలని బిజెపి అనుకుంటోందని, ఈ బిల్లు పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమని, ప్రాథమికంగా ప్రజా వ్యతిరేకమని కాంగ్రెస్ ఎంపి అభిషేక్ మను సింఘ్వి అన్నారు. ఏ విధంగానైనా బిల్లుకు ఆమోదం పొందడం ద్వారా ఢిల్లీ సర్వీసుల అధికారాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాలని బిజెపి అనుకుంటోందని విమర్శించారు. ఇది ప్రాంతీయ, ఢిల్లీ ప్రజల ఆకాంక్షలపై నేరుగా జరుపుతున్న దాడిగా ఆయన పేర్కొన్నారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని, సివిల్ సర్వీస్ అకౌంటబిలిటీ, అసెంబ్లీ ఆధారిత ప్రజాస్వామ్యాన్ని ఉల్లంఘించడమే అవుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ నేత పి చిదంబరం మాట్లాడుతూ.. రాజ్యాంగ అంశాలు పక్కనపెడితే, ఈ బిల్లులో కమిటీ విషయాన్ని తెలుపుతానని అన్నారు. కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారని, అందులో ముఖ్యమంత్రి, మరో ఇద్దరు కేంద్ర ప్రభుత్వంతో నియమితులైన వారు ఉంటారని తెలిపారు. మెజార్టీ ఇద్దరు కేంద్రం నియమించినవారే కాబట్టి వారి అభిప్రాయాలే నెగ్గుతాయని, ముఖ్యమంత్రి మాట చెల్లదని అన్నారు. అలాగే కమిటీ కోరం ఇద్దరిని బిల్లులో పేర్కొన్నారని, అలాంటప్పుడు ముఖ్యమంత్రి లేకుండానైనా కమిటీ సమావేశం నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఈ కమిటీ ప్రతిపాదనలు లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదిస్తారని, ఇది చాలా ప్రమాదకరమని అన్నారు.

25 ఏళ్ల వరుస ఓటములే కారణం : చద్దా

ఢిల్లీలో జరిగిన గత ఆరు అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి దారుణమైన ఓటమి చవిచూసిందని, ఆ కారణంగానే బిజెపి ఈ బిల్లు మిగతా 7లో

సిఎం తోలుబొమ్మగా మారుతారు

- ఢిల్లీ బిల్లు నియంతృత్వానికి ప్రతిబింబం : రాజ్యసభలో సిపిఎం ఎంపి బికాస్ రంజన్ భట్టాచార్య

లోపలి పేజీలో..



కడప కలెక్టరేట్ ఎదుట మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు



అనంతపురం కలెక్టరేట్ వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

దద్దరిల్లిన కలెక్టరేట్లు

- సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కిన మున్సిపల్ కార్మికులు

లోపలి పేజీలో..



వీరుడా జోహార్లు...

- అధికార లాంఛనాలతో బౌద్ధ సంప్రదాయం ప్రకారం గద్దర్ అంత్యక్రియలు

లోపలి పేజీలో..

విద్యుత్ కార్మికుల ధర్నా ఉద్రిక్తం

- తిరుపతి డిస్కమ్ వద్ద అడ్డుకున్న పోలీసులు
- మాజీ ఎంపి మధు సహా 26 మంది అరెస్టు, విడుదల
- 10 నుంచి నిరవధిక సమ్మెలోకి :పోరాట కమిటి

వచ్చే ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం

- పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి ప్యాకేజీ
- విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తాం : చంద్రబాబు



పోలవరం ప్రాజెక్టు వద్ద చంద్రబాబు సెల్ఫీ

ప్రజాశక్తి- పోలవరం (పశ్చిమగోదావరి జిల్లా), రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రాజెక్టుల విధ్వంసానికి పాల్పడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు కచ్చితంగా తగిన గుణపాఠం చెప్తారని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక పోలరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని, ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల నిర్వాసితులైన వారికి పూర్తి స్థాయి ప్యాకేజీ అందించి వారిని ఆనందంగా పునరావాస కాలనీలకు తరలిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తక్కువ ఖర్చుకు విద్యుదుత్పత్తి చేసి విద్యుత్ ఛార్జీలు తగ్గించేందుకు కృషి చేస్తానని అన్నారు. రాజధాని అమరావతిని, పోలవరం ప్రాజెక్టును వైసిపి ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. ఏలూరు జిల్లాలోని పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను సోమవారం ఆయన పరిశీలించి వాటి వద్ద సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రికి ఛాలెంజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం యామిని కల్యాణ మండపానికి చేరుకుని పోలవరం ప్రాజెక్టు పనులు, ప్రస్తుత స్థితి, నదుల అనుసంధానంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత పోలవరం ప్రాజెక్టు పనులను సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలోని మూడు రోడ్ల కూడలిలో రాత్రి బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. పోలవరం పర్యటనపై షరతులు విధించడాన్ని తప్పుబట్టారు. జగన్ ప్రభుత్వం గద్దెనెక్కినప్పటి నుంచీ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై శ్రద్ధ వహించలేదని, అసెంబ్లీలో రోజుకు ఒక సంవత్సరం పేరు చెప్పి ప్రాజెక్టుని అప్పుడు పూర్తి చేస్తాం, ఇప్పుడు పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికారే తప్ప, పనులు ముందుకు సాగలేదని విమర్శించారు. నిర్వాసితులను, పోలవరం ప్రాజెక్టును పట్టించుకోకపోవడం మిగతా 5లో

సంపాదకీయం


సుప్రీం చెక్

'**మో**డీ' ఇంటి పేరు వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షను గత శుక్రవారం సుప్రీం కోర్టు నిలుపుదల చేయడం ద్వారా...కింది కోర్టులు చేసిన తప్పిదాలను సరి చేసింది. 'సుప్రీం' మంజూరు చేసిన స్టే రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి భారీ ఊరట. కేంద్రంలో ఉన్న ప్రజా కంటక బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించే లక్ష్యం ప్రాతిపదికగా పని చేస్తున్న విపక్ష 'ఇండియా' సంగమం వైపు నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షాలకు చెందిన కీలక నాయకులపై ఉద్దేశపూర్వక ఎజెండాతో ఒక పథకం ప్రకారం అక్రమ కేసులు బనాయిస్తున్న బిజెపికి సుప్రీం మధ్యంతర ఉత్తర్వులు మింగుడు పడని వ్యవహారం. ఈ కేసులో తప్పించుకున్నా రాహుల్‌పై మరెన్నో కేసులున్నాయని కేంద్ర బిజెపి మంత్రులు, నేతలు ఆడిపోసుకుంటున్నారు. పరువు నష్టం కేసులో ఈ ఏడాది 23న సూరత్ ట్రయల్ కోర్టు రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించిన కొన్ని గంటల్లోనే ప్రజాప్రాతినిధ్య చట్టం నిబంధనలను ఉటంకిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పుడు సుప్రీం కోర్టు స్టే ఇచ్చిన మూడు రోజుల తర్వాత తీరిగ్గా, అదీ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాల డిమాండ్ తర్వాత సోమవారం రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫై చేయడం గమనార్హం.

2019 సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో మోడీ అనే ఇంటి పేరు ఉన్నవాళ్లందరూ దొంగలంటూ బిజెపి జమానాలో బ్యాంకులకు రూ.వేల కోట్లు ఎగనామం పెట్టి దేశాన్ని విడిచి పారిపోయిన కరడు గట్టిన ఆర్థిక నేరస్తులు లలిత్ మోడీ, నీరవ్ మోడీ, తదితరుల పేర్లను రాహుల్ ప్రస్తావించారు. వాస్తవానికి రాహుల్ చేసింది కేవలం రాజకీయ ఆరోపణ. ఒక నిర్దిష్ట కులానికి, ఇంటి పేరు కలిగిన వారికి అస్సలు వర్తించదు. ఎక్కడో కర్ణాటక కోలార్‌లో రాహుల్ విమర్శ చేస్తే గుజరాత్‌లోని సూరత్ కోర్టులో బిజెపి ఎంఎల్‌ఎ పూర్ణేశ్ మోడీ కేసు వేయడం ఒక వింత అయితే, రాష్ట్ర వ్యాప్తంగా కోట్లల్లో ఉన్న ఒబిసి కులస్తులందరి పరువుకూ రాహుల్ వ్యాఖ్యలు నష్టం కలిగించాయని క్రిమినల్ కేసు వేయడం వింతల్లో వింత. కాగా రాజకీయ విమర్శకు సూరత్ కోర్టు రాహుల్‌కు రెండేళ్ల జైలు విధించింది. ఇటువంటి కేసుల్లో రెండేళ్ల జైలు పడటం ఇదే తొలిసారి. సూరత్ మెజిస్ట్రేట్ నియామకం, హడావుడిగా సెలవుల్లేకుండా కేసు విచారణ, రెండేళ్ల జైలు శిక్ష విధింపు అసాధారణం. ఈ ప్రహసనాన్ని బట్టే రాజకీయ ప్రేరేపితం అని స్పష్టమైపోతుంది.

ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఏదైనా కేసులో దోషిగా నిర్ధారణై రెండేళ్లు, అంతకంటే ఎక్కువ శిక్ష పడితే అటువంటి వ్యక్తి రాజ్యాంగ పదవులకు అనర్హుడవుతాడు. శిక్షా కాలంతో పాటు మరో ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హత కోల్పోతారు. ఐపిసి సెక్షన్ 499 కేసులో దోషిగా నిర్ధారణ అయిన వ్యక్తికి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా లేదా కొన్ని సందర్భాల్లో ఆ రెండూ విధించే అవకాశం ఉంది. రాహుల్‌ను దోషిగా పేర్కొన్న సూరత్ కోర్టు గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష విధించడానికి కారణాలను పేర్కొనలేదని సుప్రీం కోర్టు తప్పుబట్టింది. గతంలో 'దేశ్‌కా చౌకీదార్ చోర్ హై' అన్న వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు రాహుల్‌ను మందలించిందన్న అంశాన్ని మాత్రమే ప్రస్తావించిందని పేర్కొంది. అప్పిలేట్ కోర్టు, హైకోర్టు సైతం రాహుల్ స్టే అభ్యర్థనను తోసిపుచ్చడంపై కేంద్రీకరించాయి తప్ప గరిష్ట కాల శిక్ష విధింపునకు కారణాలు తెలపలేదు. సదరు గరిష్ట కాల శిక్షే లోక్‌సభలో రాహుల్‌పై అనర్హత వేటు వేయడానికి సాధనం అయిందని కింది కోర్టుల విచారణ, పరిశీలనపై సుప్రీం తీవ్రంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఇటువంటి శిక్షలు విధించినప్పుడు ఆయా వ్యక్తులు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల ప్రజల గురించి కూడా ఆలోచించాలని పేర్కొనడం అభినందనీయం. ప్రతిపక్షాలపై ఇ.డి, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలను ప్రయోగించి కక్ష సాధిస్తున్న మోడీ ప్రభుత్వం సరికొత్తగా పరువు నష్టం (క్రిమినల్) కేసులను బనాయించే సరికొత్త మార్గాన్ని ఎంచుకుంది. అందులో భాగమే రాహుల్‌పై కేసు. కేంద్ర ప్రభుత్వ ఈ తరహా వేధింపులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.

మహనీయుల మాట




నిజం చెప్పడానికి ఎంతో ధైర్యం వుండాలి. అలాగే నిజాన్ని ఒప్పుకోవడానికి కూడా అంతకు మించిన ధైర్యం వుండాలి.

- ఆర్.కె. నారాయణ్,
రచయిత.

సార్వత్రిక ప్రాథమిక ఆదాయం

చాలామంది ఆర్థికవేత్తలు భారతదేశంలో సార్వత్రిక పాథమిక ఆదాయాన్ని అమలు చేయాలని వాదిస్తున్నారు. 2016-17 ఆర్థిక సర్వేలో సైతం ఈ విషయాన్ని అధికారికంగానే సూచించారు. ఐతే దానిని ఏ విధంగా అమలులోకి తేవాలన్న ఆచరణాత్మక విషయం మీద ప్రతిపాదనలు రకరకాలుగా వస్తున్నాయి. ఒకానొక స్థాయి కన్నా తక్కువగా ఆదాయం పొందుతున్న వారందరినీ గుర్తించి వారందరికీ ఒకేవిధంగా నగదు బదిలీ చేయాలన్నది ఒకటి. ఎవరెంత తక్కువ స్థాయిలో ఆదాయం పొందుతున్నారన్నది పరిశీలించి దానికి తగ్గట్టు నగదు బదిలీ వివిధ రకాలుగా చేయాలన్నది రెండోది. ఈ తేడాలను పక్కన పెడితే సార్వత్రిక పాథమిక ఆదాయం (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్) అనే భావన సారాంశం ఒక్కటే. సమాజంలో ప్రతీ ఒక్కరూ ఒక కనీస ప్రాథమిక స్థాయికి తగ్గకుండా ఆదాయాన్ని పొందగలగాలి. అందుకు వీలుగా ప్రభుత్వం నగదు బదిలీ చేయాలి. అప్పుడు ప్రతీ ఒక్కరూ ఒక కనీస స్థాయిలో సరుకులను పొందగలిగే పరిస్థితిలో ఉంటారు. ఆ విధంగా కనీస జీవన ప్రమాణాలను అందుకోగలుగుతారు.

ఈ సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అనే భావన పట్ల కొన్ని అభ్యంతరాలు వచ్చాయి. ఆర్థిక సర్వే వాటిని వివరంగా పేర్కొని తన నివేదికలో వాటిపై చర్చించింది. ప్రధానమైన అభ్యంతరాలు మితవాద శక్తుల నుండి వచ్చాయి. వాళ్ళ ప్రధానమైన అభ్యంతరం ఒక్కటే. ఈ విధంగా ప్రభుత్వం నేరుగా నగదు అందిస్తే ఇక దానిని అందుకున్నవాళ్ళు తమ వంతు కష్టపడి పని చేయడం మానేస్తారు. పని చేసినా, చెయ్యకపోయినా ఎటూ ఆదాయం రావడం ఖాయం గనుక ఆ కాడికి మనం పని చేయడం దేనికి? అన్న ధోరణి పెరుగుతుంది. మనం ప్రస్తుతం ఉంటున్న సమాజంలో ఒక వ్యక్తి ఆదాయం అతడు చేసే కష్టం మీద ఆధారపడి వుంటుంది అన్న ప్రాతిపదికన ఈ వాదన నడుస్తుంది. ఒక వ్యక్తి కష్టపడకపోయినా అతనికి లేదా ఆమెకు కనీస స్థాయిలో ఆదాయం గ్యారంటీగా వచ్చే పద్ధతి ప్రవేశపెడితే, అప్పుడు మన సమాజం నడక మారిపోతుంది అని మితవాదులు అంటారు. కాని ఈ వాదన బొత్తిగా అర్థరహితం. ఎందుకంటే, ప్రస్తుత సమాజంలో ధనవంతులు ఏ కష్టమూ పడకుండానే విపరీతంగా తమ సంపదను పెంచుకోగలుగుతున్నారు. ఇంకో పక్క పేదలు చాలా కొద్దిపాటి కూలి డబ్బుల కోసం రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు.



ప్రభాత్ పట్నాయక్

ఒకానొక కార్మికుడు ఎంత ఎక్కువ కష్టంతో కూడిన పని చేస్తే, ఎంత ఎక్కువ ప్రమాదంతో కూడిన పని చేస్తే అంత ఎక్కువ జీతం అతడికి వస్తుంది అని ఆడమ్ స్మిత్ చెప్పాడు. ఐతే ఆచరణలో ఆ విధంగా లేదని జాన్ స్టువార్ట్ మిల్ అనే మరో ఆర్థికవేత్త గమనించాడు. నిజానికి అటువంటి కష్టతరమైన, ప్రమాదాలతో కూడిన పనులు చేసేవారికి అతి తక్కువ వేతనాలు లభిస్తున్నాయని అతడు ఎత్తిచూపాడు.



సార్వత్రిక ప్రాథమిక ఆదాయం గ్యారంటీ చేస్తే దాని వలన జనాలు పని చేయడం మానేస్తారు అన్న వాదన ఎలాంటిదంటే, జీతాలు ఎంత పెంచితే కార్మికులు అంతగా పని ఎగ్గొడతారు అన్న వాదన లాంటిది. కార్మికుల జీతాలకు "డిమాండ్-సప్లయ్" సూత్రాన్ని వర్తింపజేసే మితవాద ఆర్థికవేత్తల వాదన ఇది.

అందుచేత ఇక్కడ సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అమలు చేయడం అంటే ఏ పనీ చేయనందుకు ఇచ్చే వేతనం కాదు. అతడు చేసే పనికి ఎక్కువ రేటు వేతనాన్ని చెల్లించడం ఔతుంది (ఒకానొక వ్యక్తి నిరుద్యోగిగా ఉన్నాడంటే అది అతడి వ్యక్తిగతమైన తప్పు కాదు, అది ఈ సామాజిక వ్యవస్థ లోపం. ఈ విషయానికి, ప్రస్తుత చర్చతో సంబంధం లేదు).

సార్వత్రిక ప్రాథమిక ఆదాయం గ్యారంటీ చేస్తే దాని వలన జనాలు పని చేయడం మానేస్తారు అన్న వాదన ఎలాంటిదంటే, జీతాలు ఎంత పెంచితే కార్మికులు అంతగా పని ఎగ్గొడతారు అన్న వాదన లాంటిది. కార్మికుల జీతాలకు "డిమాండ్-సప్లయ్" సూత్రాన్ని వర్తింపజేసే మితవాద ఆర్థికవేత్తల వాదన ఇది. ఈ వాదన నైతికంగా సహించకూడనిది, విశ్లేషణాత్మకంగా చూస్తే నిరాధారమైనది. అందుకే "ధనవంతులు ఎంత ఎక్కువగా సంపాదిస్తే అంత బాగా పని చేస్తారు, పేదలు ఎంత తక్కువ జీతం ఇస్తే అంత బాగా పని చేస్తారు" అన్నట్టుగా వీళ్ళ వాదన ఉందని జెకె గాల్బ్రియత్ అనే అమెరికన్ ఆర్థికవేత్త మితవాదులను అవహేళన చేశాడు.

సార్వత్రిక ప్రాథమిక ఆదాయం ఇవ్వాలన్న ప్రతిపాదన దేనికి? ఆ పేదలు విద్య, వైద్యం, వగైరాలను పొందడానికే కదా? అటువంటప్పుడు ఆ యా హక్కులను కల్పించే చట్టాలను చేయడం ప్రయోజనకరం ఔతుంది కాని, సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని ఇస్తూ అందుకోసం విద్య, వైద్యం తదితర హక్కులలో కోతలు పెట్టడం వలన ఏమిటి ఉపయోగం?

మితవాదులు సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని వ్యతిరేస్తే, అభ్యుదయ కాముకులైన ఉదారవాదులు (లిబరల్స్) ఈ ప్రతిపాదనను బలంగా ముందుకు తెస్తున్నారు. ఐతే ఈ ఉదారవాదుల ప్రతిపాదన ఎలాంటిదంటే కోడిగుడ్డును పగలగొట్టకుండానే ఆమ్లెట్‌ను తయారు చెయ్యాలన్నటు వంటిది. మామూలుగా ఈ ఉదారవాదుల ప్రతిపాదనలన్నీ ఈ విధంగానే ఉంటాయి. వీళ్ళు ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ లోపలనే సమాజం కొనసాగాల నుకుంటారు. అదే సమయంలో ఈ సమాజం కార్మికవర్గం పట్ల మరింత మానవత్వంతో మెలగాలని అంటారు. మరైతే అందుకోసం పెట్టుబడిదారులను మరీ ఎక్కువగా ఇబ్బంది పెట్టకూడదని కూడా అంటారు. అందుకనే సార్వత్రిక ప్రాథమిక ఆదాయం పేర చెల్లించవలసిన మొత్తం చాలా స్వల్పంగా ప్రతిపాదించారు. ఉదాహరణకి 2016-17 ఆర్థిక సర్వే ఒక సంవత్సరానికి ఒక వ్యక్తికి రు.7620 చొప్పున బదిలీ చేయాలని ప్రతిపాదించింది. మెరుగైన జీతాలు పొందే 25 శాతం కార్మికులను మినహాయించి తక్కినవారందరికీ తలా రు.7620 చొప్పున ఏడాదికి చెల్లించాలంటే అందుకు మన జిడిపిలో 4.9 శాతం కేటాయించాలి. దానితో సరిసమానమైన మొత్తాన్ని గనుక అత్యల్ప ఆదాయాలు పొందుతున్న 75 శాతం ప్రజలకు కేటాయిస్తే (2011-12 నాటి ధరల ప్రాతిపదికన) దాని వలన దేశంలో పేదరికం ఆ ఏడాదిలో (2011-12 లో) కేవలం 0.5 శాతం మాత్రమే ఉండివుండేది. అంటే పేదరికం దాదాపు లేకుండా పోయేదని ఆర్థిక సర్వే పేర్కొంది. ఐతే, తలా రూ.7620 చెల్లించడం కోసం అవసరమయ్యే ఆర్థిక వనరులను సేకరించడానికి ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రకరకాల సబ్సిడీలన్నింటికీ కోత పెట్టవచ్చునని ఆర్థిక సర్వే సూచనప్రాయంగా చెప్పింది.

ఆర్థిక సర్వే చెప్పిన లెక్కలతో రెండు సమస్యలు ఉన్నాయి. మొదటిది: సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అమలు జరగడం వలన పేదలు తినే ఆహారపు కేలరీల విలువ దాదాపు 50 శాతం పెరుగుతుందని ఆ సర్వే చెప్పింది. ఆ మేరకు వారికి బదిలీ చేసే నగదు మొత్తంలో పెరుగుదల ఉండాలంటే జిడిపిలో 4.9 శాతం చాలదు, 7.5 శాతం కావాలి. ఆర్థిక సర్వే సూచించినట్టు సార్వత్రిక ప్రాథమిక వేతనాన్ని అమలు చేసేటప్పుడు ఇతర సబ్సిడీలకు కోత పెట్టడం జరిగితే అప్పుడు సాలుకి రూ. 7620 సరిపోదు.

సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని అమలు చేయడానికి వచ్చిన ఇతర సూచనలు చాలా పరిమితలక్ష్యాలతో ఉన్నాయి.

ఒకవేళ ఈ సార్వత్రిక ప్రాథమిక ఆదాయం విధానాన్ని అమలు చేయడానికి పార్లమెంటులో ఒక చట్టాన్ని తీసుకు వచ్చి, అందులో పెరిగే ధరలకు అనుగుణంగా చెల్లింపులు పెంచాలన్న నిబంధనను కూడా విధిస్తే (ఇప్పుడు ఉపాధి హామీ చట్టంలో ఉన్నట్టు) అప్పుడు ప్రభుత్వం విద్య, వైద్యం తదితర పద్దుల్లో కోత పెట్టి ఈ విధానాన్ని అమలు చేస్తుంది. అప్పుడు పేదల దగ్గర ప్రభుత్వం ఇచ్చిన సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అయితే ఉంటుంది కాని, వాళ్ళ బిడ్డల్ని ఉచితంగా చదివించే స్కూళ్ళు గాని, వాళ్ళ రోగాలకి ఉచితంగా వైద్యం చేసే ఆస్పత్రులు గాని ఉండవు. ఒకవేళ ప్రైవేటు స్కూళ్ళకు, ప్రైవేటు ఆస్పత్రులకు పోతే ప్రభుత్వం సార్వత్రిక ప్రాథమిక వేతనం కింద ఇచ్చిన సొమ్ము కాస్తా వాటికే పోతుంది. అప్పుడు వారి వినిమయ శక్తి తగ్గిపోతుంది. సార్వత్రిక ప్రాథమిక వేతనం విధానాన్ని ప్రవేశపెట్టిన లక్ష్యం నెరవేరదు. అందరికీ ప్రాథమిక ఆదాయాన్ని పొందే హక్కు కల్పించే చట్టాన్ని తెచ్చినా, అందుకోసం ప్రభుత్వం అందించే నగదు బదిలీల నిమిత్తం ఇతర సబ్సిడీలలో విధించే కోతల కారణంగా ఆ చట్టం నిరుపయోగం ఔతుంది.

అందుచేత సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని పొందే హక్కును ఒక చట్టంగా చేయడం కన్నా, ప్రజలకు కొన్ని కనీస హక్కులను గ్యారంటీ చేసే చట్టాలను తీసుకురావడం ఎక్కువ ఉపయోగం. నాణ్యత కల విద్యను ఉచితంగా పొందే హక్కు, నాణ్యత కలిగిన విద్య, సేవలను ఉచితంగా పొందే హక్కు, ఉపాధి పొందే హక్కు, ఉచితంగా వృద్ధాప్య పెన్షన్ పొందే హక్కు, అంగవైకల్యానికి పరిహారం పొందే హక్కు వగైరా హక్కులను కల్పిస్తూ చట్టాలు తీసుకురావడం అవసరం. నిజానికి సార్వత్రిక ప్రాథమిక ఆదాయం ఇవ్వాలన్న ప్రతిపాదన దేనికి? ఆ పేదలు విద్య, వైద్యం, వగైరాలను పొందడానికే కదా? అటువంటప్పుడు ఆ యా హక్కులను కల్పించే చట్టాలను చేయడం ప్రయోజనకరం ఔతుంది కాని, సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని ఇస్తూ అందుకోసం విద్య, వైద్యం తదితర హక్కులలో కోతలు పెట్టడం వలన ఏమిటి ఉపయోగం?

ఐతే ఈ ఉదారవాదుల ప్రతిపాదన ఎలాంటిదంటే కోడిగుడ్డును పగలగొట్టకుండానే ఆమ్లెట్‌ను తయారు చెయ్యాలన్నటువంటిది. మామూలుగా ఈ ఉదారవాదుల ప్రతిపాదనలన్నీ ఈ విధంగానే ఉంటాయి. వీళ్ళు ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ లోపలనే సమాజం కొనసాగాలనుకుంటారు. అదే సమయంలో ఈ సమాజం కార్మికవర్గం పట్ల మరింత మానవత్వంతో మెలగాలని అంటారు. మరైతే అందుకోసం పెట్టుబడిదారులను మరీ ఎక్కువగా ఇబ్బంది పెట్టకూడదని కూడా అంటారు.

అందుచేత సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అనే భావన చాలా సదుద్దేశ్యంతో కూడినదైనప్పటికీ, అది బొత్తిగా అర్థం లేనిది. నిజంగా దేశంలో ప్రజల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలనుకుంటే, అప్పుడు వైద్యం, విద్య, ఉపాధి తదితర హక్కులను కల్పించే చట్టాలను చేయడమే గాక, సంక్షేమానికి కేటాయింపులను బాగా పెంచాల్సి వుంటుంది. ఆర్థిక సర్వే సూచించిన మొత్తం ఏ మూలకూ చాలదు.

ఆహార హక్కు, ఉపాధి హక్కు (లేదా ఉపాధి దొరికేదాకా కనీస వేతనం), నాణ్యత కల వైద్యం పొందే హక్కు, నాణ్యత కల విద్య పొందే హక్కు, వృద్ధాప్య, వికలాంగ పెన్షన్ పొందే హక్కు- ఈ అయిదింటినీ కల్పించాలంటే అందుకు మన జిడిపిలో కనీసం 10 శాతం కేటాయించడం అవసరం. అందుకోసం ప్రభుత్వం పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని కనీసం 7 శాతం మేరకు పెంచాలి (తక్కిన 3 శాతం ప్రజలు చేసే ఖర్చు పెరిగినందువలన లభిస్తుంది.).

అదనంగా 7 శాతం పన్నులు పెంచడం ప్రభుత్వానికి పెద్ద కష్టమేమీ కాదు. సంపన్నుల మీద అదనపు పన్నులు వేయగలగాలి. అంతే. అత్యంత సంపన్నులైన ఒక్క శాతం జనాభా మీద సంపద పన్ను 2 శాతం చొప్పున అదనంగా విధించాలి. వారసత్వంగా ఆస్తి సంక్రమించినప్పుడు (ఈ ఒక్క శాతం జనాభాలోనే) అందులో 33.33 శాతం వారసత్వ పన్నుగా విధించాలి. ఈ రెండు పన్నులూ చాలు. దేశం మొత్తం మీద పైన చెప్పిన 5 హక్కులనూ అమలు చేయడానికి సరిపడా ధనం సమకూరుతుంది. ఐతే అప్పుడు మన దేశం సంక్షేమ రాజ్యం ఔతుంది. ఆ విధంగా మార్చడం ఈ బూర్జువా వ్యవస్థ శక్తికి మించిన పని. బూర్జువా వ్యవస్థ పరిధిని దాటని ఉదారవాద ఆర్థికవేత్తల అవగాహనకు అందని వ్యవహారం ఇది.

(స్వేచ్ఛానుసరణ)

నష్టాల్లో కొబ్బరి రైతులు...

ఉద్యమం

"**కొ**బ్బరి చెట్టు కొడుకు కన్నా మిన్న" అని పెద్దలు అంటారు. కొడుకులు చూసినా చూడకపోయినా ఇంటి దగ్గర పది కొబ్బరి చెట్లు ఉంటే బతికేయవచ్చని నమ్మకం. అట్లాంటి కొబ్బరి పంటను నమ్ముకున్న రైతులు నేడు నష్టాల్లో ఉన్నారు. ప్రపంచ కొబ్బరి ఉత్పత్తిలో భారతదేశం మూడవ స్థానంలో ఉంది. మన దేశంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక తర్వాత ఆంధ్రప్రదేశ్ నాల్గవ స్థానంలో ఉంది. రాష్ట్రంలో దాదాపు మూడు లక్షల 50 వేల ఎకరాల వరకు కొబ్బరి విస్తీర్ణం ఉంది. ప్రధానంగా సముద్ర తీరంలో ఉన్న కోనసీమ, ఉద్దానం ప్రాంతాలలో అధిక విస్తీర్ణంలో ఉన్నా మెట్ట భూములలో కూడా కొబ్బరి విస్తీర్ణం అధికంగానే ఉంది. కోకోనట్ బోర్డు లెక్కల ప్రకారం రాష్ట్రం విస్తీర్ణంలో నాలుగో స్థానంలో ఉన్నా ఉత్పాదకతలో మొదటి స్థానంలో ఉంది. గత అనేక సంవత్సరాలుగా ఎర్ర నల్లి, తెల్ల దోమ వంటి తెగుళ్లు ఆశించడంతో కొబ్బరి దిగుబడి బాగా తగ్గింది. మరోవైపు మార్కెట్‌లో ధరలు హెచ్చుతగ్గులుగా ఉండడం వలన కూడా కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కరోనా కాలం నుండి కొబ్బరి రైతులు నష్టాలనే చవిచూస్తున్నారు. కొబ్బరి రైతులకు ఉద్యాన శాఖ ద్వారా సబ్సిడీ పథకాలు అమలు కావడం లేదు.



కె. శ్రీనివాస్

ఎకరా కొబ్బరి సాగుకు సంవత్సరానికి రూ.40 వేలకు పైగా పెట్టుబడి ఖర్చులు అవుతున్నాయి. ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిపోవడంతో పంట ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయాయి. చెట్టు నుండి కొబ్బరికాయలు కోసి గుట్టలుగా వేయడానికి ఒక్కో కాయకు 3 రూపాయలు ఖర్చవుతున్నది. అయితే వ్యాపారులు ఎండు కొబ్బరికాయకు 6 రూపాయలకు మించి ధర ఇవ్వడం లేదు. 100 కొబ్బరికాయలు కొనుగోలు చేస్తే రైతు నుండి అదనంగా 10 కొబ్బరికాయలు వ్యాపారులు తీసుకుంటున్నారు. కొబ్బరి రైతుకు కోత ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉంది. వ్యాపారులు కొబ్బరి తోటలలో పంట కొనుగోలు సందర్భంగా ఒక్కో కొబ్బరి చెట్టుకు గతంలో వెయ్యి రూపాయలు వరకు ధర ఇచ్చేవారు. ఈ సంవత్సరం ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ.550 నుండి రూ.700 వరకు ధర ఇస్తున్నారు. ఎకరా కొబ్బరి తోటలో సుమారు 60 చెట్లు ఉండడం వలన గతంలో ఎకరాకు రూ.60 వేలు ఆదాయం వచ్చేది. కొన్ని ప్రాంతాల్లో కొబ్బరి అంతర పంటగా కోకో ఇతర పంటలు సాగు చేయడంతో మరో రూ.30 వేల నుండి 40 వేలు ఆదాయం వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు. కష్టపడి రైతు నాణ్యమైన పంట పండించినా కొనుగోలు చేసే స్థితి లేదు. నష్టాలకు కొబ్బరికాయలు అమ్ముకోలేక తోటలో నిల్వబెడితే వర్షాలకు తడిచి మొలకలు వచ్చేస్తున్నాయి.



ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలి. కొబ్బరి అధికంగా పండించే ప్రాంతాలలో పరిశోధనా కేంద్రాలు, కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. సమస్యలు పరిష్కారానికి కొబ్బరి రైతులందరూ సంఘటితం కావడమే ఇందుకు పరిష్కారం.

కొబ్బరి రైతుల గోడును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. మార్కెట్‌లో వినియోగదారులు మాత్రం ఒక్కో కొబ్బరికాయను 20 నుండి 25 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్ మాయాజాలంతో కొబ్బరి రైతులు నలిగిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు కొబ్బరికాయలు ఎగుమతి అవుతున్నాయి. వేసవి కాలంలో కొబ్బరి బోండాలకు డిమాండ్ ఉంటుంది. పండుగల సమయంలో కొబ్బరికాయలు వినియోగం అధికంగా ఉంటుంది. ప్రస్తుతం ఎండు కొబ్బరికి కూడా మార్కెట్‌లో డిమాండ్ ఉంది. మార్కెట్‌లో ధర ఎగుడు దిగుడులు సందర్భంగా అవసరమైతే నిల్వ చేసుకుని ధర పెరిగిన తర్వాత అమ్ముకునే అవకాశం రైతుకు లేదు. అందుకు తగిన గిడ్డంగులు గానీ, కోల్డ్ స్టోరేజ్‌లు గానీ అందుబాటులో లేవు. కొబ్బరి పంట ప్రాంతాలలో కొన్ని చోట్ల కొబ్బరి పీచు పరిశ్రమలు ఏర్పాటు చేశారు. కొబ్బరి ద్వారా తయారయ్యే మిగిలిన వివిధ ఉత్పత్తులకు సంబంధించిన తగిన పరిశ్రమలు లేవు. కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడం వలన రైతులకు ఆదాయం, యువతకు ఉపాధి దొరికే అవకాశం ఉంటుంది. ఆ విధంగా ప్రభుత్వాలు ఆలోచనలు చేయడం లేదు. కొబ్బరి వలుపు, దింపుడు కార్మికులు వేల సంఖ్యలో ఉపాధి పొందుతున్నారు. కొబ్బరి రైతు నష్టాలు ప్రభావం వీరు కనీస వేతనాలపై ఉంటుంది.

కొబ్బరి రైతు పెట్టిన పెట్టుబడికి కనీసం మార్కెట్‌లో ఒక్కో కాయకు రూ.15 ధర ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అయితే మార్కెట్‌లో వ్యాపారులు ఆ ధర ఇవ్వడం లేదు. ఈ పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. మన రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.3 వేల కోట్లు ధరల స్థిరీకరణ నిధి కేటాయిస్తామని రాష్ట్ర బడ్జెట్ ప్రసంగాల్లో చాలా గొప్పగా చెబుతున్నారు. విత్తనం నుండి విక్రయం వరకు రైతు భరోసా కేంద్రాలు పని చేస్తున్నాయని ప్రచారం ఊదరగొడుతున్నారు. ఆచరణకు వచ్చేసరికి అమలు కావడంలేదు. నాఫెడ్, ఆయిల్ ఫెడ్ రంగంలోకి దిగి రైతుల నుండి కొబ్బరికాయలు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నా పట్టించుకునే పరిస్థితి కనబడడం లేదు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల సందర్భంగా రాష్ట్ర ఎంపీలు కొబ్బరి రైతుల గోడు వినిపించి కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ఒత్తిడి చేసే ప్రయత్నాలు ఎక్కడా కానరావడం లేదు.

ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలి. కొబ్బరి అధికంగా పండించే ప్రాంతాలలో పరిశోధనా కేంద్రాలు, కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. సమస్యలు పరిష్కారానికి కొబ్బరి రైతులందరూ సంఘటితం కావడమే ఇందుకు పరిష్కారం.

(వ్యాసకర్త ఎ.పి. రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి,
సెల్ : 94900 98574)

పెనుసవాల్‌గా మానవ అక్రమ రవాణా

సమస్య

మానవ అక్రమ రవాణా ప్రపంచ దేశాలకు పెద్ద సవాలు విసురుతోంది. ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న మానవ అక్రమ రవాణాలో ఎక్కువ మంది బాధితులు మహిళలే. అమ్మకపు సరుకుగా మారిన మహిళలను కేవలం లైంగిక దోపిడీ కోసం విదేశాలకు తరలించడం సాధారణంగా మారింది. భారత్‌లో అక్రమ రవాణా బాధితుల్లో 80 శాతం మహిళలే. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో రికార్డుల ప్రకారం గత ఐదేళ్లలో సంవత్సరానికి సగటున మొత్తం 5 వేలకు పైగా మానవ అక్రమ రవాణా కేసులు నమోదవుతున్నాయి. బీహార్, మహారాష్ట్ర, తెలంగాణ, జార్ఖండ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, అస్సాం...తదితర రాష్ట్రాల్లో ఈ ప్రభావం అధికంగా ఉన్నట్టు ఆ రికార్డులు పేర్కొంటున్నాయి.

అక్రమ రవాణా జరగకుండా అడ్డుకునేందుకు బలమైన చట్టాన్ని కోరుతూ బచ్‌పన్ బచావో ఆందోళన్, ఇతర పౌర సంస్థలు 2017లో దేశ వ్యాప్తంగా పెద్ద ఉద్యమాన్ని చేపట్టాయి. చట్టం ఆవశ్యకతను వివరిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. ఈ నేపథ్యంలో 2018లో మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం, బాధితులను కాపాడడం, పునరావాసం కల్పించడం అనే దృష్టితో ఒక బిల్లుకు రూపకల్పన జరిగింది. బలవంతంగా పనులు చేయించుకోవడం, భిక్షాటన కోసం, బాలికల్లో అసహజ పద్ధతుల్లో మెచ్యూరిటీ వచ్చేలా హార్మోన్లపై రసాయనాల ప్రయోగం, వివాహం పేరుతో మోసం చేసి తరలించడం వంటి వాటిని తీవ్ర స్థాయి నేరాలుగా ఈ బిల్లులో ప్రస్తావించారు. నిర్ణీత కాల వ్యవధిలో విచారణ, బాధితులను స్వస్థలానికి పంపే ఏర్పాటు, బాధితులు భౌతిక, మానసిక క్షోభ నుంచి బయటపడేందుకు 30 రోజులలో తాత్కాలిక పరిహారం, అక్రమ రవాణాకు సహకరించే వారిపై చట్టపరమైన చర్యలు, శిక్షలను ఈ బిల్లులో పొందుపరిచారు. తొలిసారిగా పునరావాస నిధిని ఏర్పాటు చేసి బాధితుల విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య రక్షణకు వినియోగించేలా రూపొందించారు. అంతర్జాతీయ స్వభావాన్ని కలిగిఉన్న నేపథ్యంలో నేషనల్ యాంటీ ట్రాఫికింగ్ బ్యూరో, విదేశాలతో, అంతర్జాతీయ సంస్థలతో పరస్పర సమన్వయం, దర్యాప్తులో విదేశీ సహాయం తదితర చర్యలకు అవకాశం ఉండేలా కేంద్ర మంత్రి మండలి



ఆమోదించిన బిల్లును నాటి శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధీ పార్లమెంటులో ప్రవేశ పెట్టారు. లోక్‌సభలో అమోదం పొందిన సదరు బిల్లు ఇప్పటి వరకూ రాజ్యసభకు చేరలేదు.

ఇదిలా ఉండగానే మానవ అక్రమ రవాణా నివారణ, సంరక్షణ, పునరావాసం బిల్లు-2021 పేరుతో కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ మరో బిల్లును ప్రతిపాదించినప్పటికీ చట్టం రూపొందేలా సరైన దిశగా అడుగులు ముందుకు పడడం లేదు. ఈ విషయంలో ప్రభుత్వాల్లో చిత్తశుద్ధి కొరవడడమే ఇందుకు కారణం. బాధితుల సంరక్షణ, పునరావాస చర్యల గురించి ప్రభుత్వానికి జవాబుదారీతనం లేకుండా పోయిందనే విమర్శలూ ఉన్నాయి. అక్రమ రవాణాను ఎక్కడికక్కడ నిలువరించేలా యాంటీ-హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ల ఏర్పాట్లపైన కూడా సరైన చర్యలు లేవు. దేశంలో పశువులు, ఇతర అంశాల్లో అక్రమ రవాణాను నిలువరించేలా వివిధ చట్టాలున్నా ఇంతకాలం మానవ అక్రమ రవాణాతో కలిపి ఒక సమగ్ర చట్టం రూపొందించకపోవడం దురదృష్టకరమే. మనుషులను పశువుల్లా కొని, విక్రయించినంత కాలం ఆ దేశంలో నాగరికత లేనట్టే లెక్క. కాబట్టి ఈ పార్లమెంటు సమావేశాల్లోనైనా మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సమగ్రమైన చట్టాన్ని రూపొందించి భవిష్యత్తులో అక్రమ రవాణా లేని దేశంగా భారత్‌ను నిలపడంలో ప్రభుత్వం కృషి చేయాలని కోరుకుందాం.

- డా॥ సి.ఎన్. క్షేత్రపాల్ రెడ్డి,
సెల్ : 9059837847

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
O.A. No. 99 OF 2023

Between
HDFC Bank Ltd., Rep. by its Authorised Officer, Seethammadhara Branch, Visakhapatnam ...Applicant Bank
And
Shaik Mohammad Hanif ...Defendant

SUBSTITUTED SERVICE OF SUMMONS TO THE DEFENDANT BY WAY OF PAPER PUBLICATION

Defendant: Shaik Mohammad Hanif, S/o. Khasim Saheb Shaik, R/o. D. No. 17-21-23/A, Allauddin Street, Pejjanipet, Vijayawada - 520003.

1. WHEREAS the applicant Bank has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you for the Recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 or at such time immediately thereafter according to the convenience of Tribunal on **23-08-2023,** you are directed to collect the copy of the application and annexure on your appearance before the Tribunal.
2. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
3. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/ Advocate duly instructed.
4. Take notice that, in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the **6th day of July, 2023.**

Signature of the Officer
Authorized to issue summons

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
O.A. No. 397 OF 2023

Between
HDFC Bank Ltd., Rep. by its Authorised Officer, Seethammadhara Branch, Visakhapatnam ...Applicant Bank
And
Dhathatreya Drilling & Mining Services ...Defendant

SUBSTITUTED SERVICE OF SUMMONS TO THE DEFENDANT BY WAY OF PAPER PUBLICATION

Defendant: Dhathatreya Drilling And Mining Services, H. No. 2-10, Harijana wada, Near Panchatiti Office, Prodduturu, Vijayawada, Andhra Pradesh - 521 151.

1. WHEREAS the applicant Bank has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you for the Recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 or at such time immediately thereafter according to the convenience of Tribunal on **29-08-2023,** you are directed to collect the copy of the application and annexure on your appearance before the Tribunal.
2. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
3. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/ Advocate duly instructed.
4. Take notice that, in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the **3rd day of August, 2023.**

Signature of the Officer
Authorized to issue summons

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
O.A. No. 98 OF 2023

Between
HDFC Bank Ltd., Rep. by its Authorised Officer, Seethammadhara Branch, Visakhapatnam ...Applicant Bank
And
1. Chitta Giridhara Reddy,
2. Chitta Raghavamma,
3. Subba Rao Vuyyuru ...Defendants

SUBSTITUTED SERVICE OF SUMMONS TO THE DEFENDANTS NOS. 1 TO 3 BY WAY OF PAPER PUBLICATION

D1. Chitta Giridhara Reddy, S/o. Peddi Reddy, R/o. D. No. 4-21-63/1, 4th Line, Chaitanya Puri, Guntur - 522007.
D2. Chitta Raghavamma, Chitta Giridhara Reddy, R/o. D. No. 4-21-63/1, 4th Line, Chaitanya Puri, Guntur - 522007.
D3. Subba Rao Vuyyuru, R/o. D. No. 1-5-113, Thalluru, Guntur - 522529.

1. WHEREAS the applicant Bank has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you for the Recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 or at such time immediately thereafter according to the convenience of Tribunal on **23-08-2023,** you are directed to collect the copy of the application and annexure on your appearance before the Tribunal.
2. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
3. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/ Advocate duly instructed.
4. Take notice that, in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the **6th day of July, 2023.**

Signature of the Officer
Authorized to issue summons

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
O.A. No. 97 OF 2023

Between
HDFC Bank Ltd., Rep. by its Authorised Officer, Seethammadhara Branch, Visakhapatnam ...Applicant Bank
And
1. Borra Pradeep Roy, 2. Borra Lakshmi,
3. Borra Durga Rao ...Defendants

SUBSTITUTED SERVICE OF SUMMONS TO THE DEFENDANTS NOS. 1 TO 3 BY WAY OF PAPER PUBLICATION

1. Borra Pradeep Roy, R/o. D. No. 76-8/7-12, Latha Hospital Road, Near Krishnaveni School, Bhavanipuram, Vijayawada - 520012. **2. Borra Lakshmi,** R/o. D. No. 76-8/7-12, Latha Hospital Road, Near Krishnaveni School, Bhavanipuram, Vijayawada - 520012.
2. Durga Rao Borra, R/o. D. No. 76-8/7-12, Latha Hospital Road, Near Krishnaveni School, Bhavanipuram, Vijayawada - 520012.

1. WHEREAS the applicant Bank has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you for the Recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 or at such time immediately thereafter according to the convenience of Tribunal on **23-08-2023,** you are directed to collect the copy of the application and annexure on your appearance before the Tribunal.
2. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
3. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/ Advocate duly instructed.
4. Take notice that, in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the **6th day of July, 2023.**

Signature of the Officer
Authorized to issue summons



మెరుగుపడిన బుద్ధదేవ్ ఆరోగ్యం

- త్వరలో డిశ్చార్జి

కోల్‌కతా: డెబ్బయితొమ్మిదేళ్ల మార్క్సిస్టు నేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. ఒకటి రెండు రోజుల్లో ఆయనను డిశ్చార్జి చేసే విషయం గురించి వైద్యులు ఆలోచిస్తున్నట్టు ఆసుపత్రి అధికారులు తెలిపారు. బుద్ధ దేవ్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఇటీవల ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే. కంటిన్యూగా కాకుండా అప్పుడప్పుడు నాన్ ఇన్వాసివ్ వెంటిలేటరీ సపోర్టు తీసుకుంటున్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగు పడిందని వారు తెలిపారు.



ఢిల్లీ సర్వీస్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు వీల్ చైర్‌లో రాజ్యసభకు విచ్చేసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్.

వీరుడా జోహార్లు...

అధికార లాంఛనాలతో బౌద్ధ సంప్రదాయం ప్రకారం గద్దర్ అంత్యక్రియలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అశేష అభిమాన జనవాహిని, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య ప్రజా గాయకుడు గద్దర్ అంత్యక్రియలు ముగిశాయి. అల్వాల్‌లోని మహాబోధి విద్యాలయ ఆవరణలో బౌద్ధ సంప్ర దాయం ప్రకారం కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో అంతిమ సంస్కారాలను పూర్తి చేశారు. గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి పోలీసులు గద్దర్‌కు గౌరవవందనం సమర్పించారు. గద్దర్‌ను కడసారిగా చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో తొక్కిసలాట జరిగింది. "జోహార్ గద్దరన్న..., లాంగ్ లివ్ గద్దరన్న, లాల్ సలాం - నీల్ సలాం, జైభీమ్, గద్దర్ ఆశయాలు కొనసాగిద్దాం..., గద్దర్ కలలు సాధించుకుందాం..., తెలం గాణ అమర వీరులకు జోహార్.." నినాదాలతో విద్యాలయ ప్రాంగణం మార్మోగింది.

ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఎల్‌బి స్టేడియం నుంచి గద్దర్ అంతిమయాత్రం ప్రారంభ మయింది. ఎల్‌బి స్టేడియంలో గద్దర్ పార్థివదేహా నికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, తెలంగాణ మంత్రుల తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి, సినీ ప్రముఖులు మంచు మోహన్‌బాబు, మనోజ్, కొణిదెల నాగబాబు, నిహారిక, అలీ, సిపిఎం నేతలు తమ్మినేని వీరభద్రం, చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి, డిజి నర్సింగరావు, సిపిఐ నాయకులు, టిడిపి నేత పరిటాల శ్రీరామ్, తదితరులు విప్లవ జోహార్లు సమర్పించారు. ఎల్‌బి స్టేడియం నుంచి గన్‌పార్క్, అంబేద్కర్ విగ్రహం, ట్యాంక్ బండ్ మీదుగా అల్వాల్‌లోని నివాసం వరకు గద్దర్ అంతిమయాత్ర కొనసాగింది. వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో గద్దర్ నివాసానికి వచ్చిన సిఎం కెసిఆర్ ఆయనకు నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రజా గాయకుడు గద్దర్ అంత్యక్రియల్లో విషాదం చోటుచేసుకుంది. గద్దర్‌కి అత్యంత ఆప్తుడు, సియాసత్ ఉర్దూ పత్రిక ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్(63) గుండెపోటుతో మృతిచెం దారు. సియాసత్ ఉర్దూ పత్రిక ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ కిందపడిపోయారు. వెంటనే పక్కనే ఉన్న ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు.



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు

సొలిసిటర్ జనరల్ వ్యాఖ్యలపై మణిపూర్ గిరిజన మహిళా సంఘాల ఆగ్రహం

- ఆ వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్

న్యూఢిల్లీ: సుప్రీం కోర్టులో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వ్యాఖ్యలపై మణిపూర్ ట్రైబల్ మహిళా గ్రూపులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. ఆగస్టు 1న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్ర చూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట కేంద్ర, మణిపూర్ ప్రభుత్వాల తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ ఇంఫాల్‌లో ఎవరూ క్లెయిమ్ చేయని మృత దేహాలు చాలా ఉన్నాయని, నెలల తరబడి ఉండడం వల్ల అవి కుళ్లిపోతున్నాయని, ఇవి చొరబాటుదారులు లేదా అక్రమ వలసదారులవి కావడం వల్లే వీటి కోసం ఎవరూ రాలేదని, వీరంతా ఒక పథకం ప్రకారం వచ్చి చంపబడిన చొరబాటుదారులు అని పేర్కొన్నట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. దీనిపై ఢిల్లీలోని ఎన్‌సిఆర్‌కు చెందిన మహిళా సంస్థలు, మణిపూర్ కుకీ-హ్మార్-జోమీ తెగకు చెందిన మహిళా గ్రూపులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇటువంటి నిరాధారమైన, విశృంఖలమైన వ్యాఖ్యలు చేయడం సొలిసిటర్ జనరల్ వంటి వ్యక్తికి తగునా అని ప్రశ్నించాయి. తుషార్ వ్యాఖ్యలు ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు, అసహ్యకరమైనవి అని పేర్కొన్నాయి. మణిపూర్ కుకీ-హ్మార్-జోమీ సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తల్లులను ఈ వ్యాఖ్యలు చాలా బాధించాయని ట్రైబల్ మహిళా గ్రూపులు తెలిపాయి. మృత దేహాలను చూడడానికి ఇంఫాల్ వెళితే తిరిగి బతికొచ్చే పరిస్థితి ఉందా? వారిని చుర్‌చందపూర్‌కు తీసుకురావాలని కుకీ-హ్మార్-జోమీ మహిళా సంఘాలు పదేపదే కోరాయి. అయినా,అధికారులు స్పందించలేదు. వాస్తవమిది కాగా, పచ్చి అబద్ధాలను సొలిసిటర్ జనరల్ సుప్రీం కోర్టులో చెప్పడం కోర్టును తప్పుదోవ పట్టించడం కాదా? అని ప్రశ్నించాయి. గిరిజన మహిళల తరపు న్యాయవాది కోలిన్ గొన్సాల్వెజ్ మాట్లాడుతూ, 118 మంది గిరిజనుల మృతదేహాలు ఇంఫాల్‌లోని శవాల గదిలో ఉన్నాయని, వాటిని మేము గుర్తించడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి భద్రత కానీ, సహకారం కానీ లేదని పేర్కొన్నారు.

మోడీ సర్కార్‌పై నేడు అవిశ్వాసం

- చర్చను రాహుల్ ప్రారంభించే అవకాశం

న్యూఢిల్లీ: మణిపూర్‌పై ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంటులో నోరు విప్పేలా చేసేందుకు ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం చర్చ మొదలుకానుంది. ఈ తీర్మానంపై 'ఇండియా' బ్లాక్ నుంచి చర్చను కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రారంభించే అవకాశముంది. లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్ గౌరవ్ గగోయ్ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని మంగళవారం నాటి లోక్‌సభ ఎజెండాలో మూడవ అంశంగా ఉంది. అవిశ్వాసంపై చర్చకు గురువారం నాడు ప్రధాని మోడీ సమాధానమిస్తారు. మోడీ ప్రభుత్వ ముదనష్టపు పాలనను ఎండగట్టేందుకు ప్రతిపక్షాలకు ఇదొక మంచి అవకాశంగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
విజయవాడ ఎమ్‌పిఎఫ్ బ్రాంచ్
మిల్క్ ప్రాడక్ట్స్ ఫ్యాక్టరీ ప్రాంగణం, విజయవాడ-1. ఫోన్: 8331015691

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత(లు): శ్రీ పిట్టల శివ సీతారామయ్య మరియు శ్రీమతి పిట్టల నాగ శేష కుమారి** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ. 34,98,369.86 (అక్షరాల ముప్పై నాలుగు లక్షల తొంభై ఎనిమిది వేల మూడు వందల అరవై తొమ్మిది రూపాయలు మరియు ఎనభై ఆరు పైసలు)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది **04/05/2023న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **05.08.2023వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీతలు, హామీదారులు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీతలు, హామీదారులు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్, విజయవాడ ఎమ్‌పిఎఫ్ బ్రాంచ్** వారికి తేది. 04.08.2023 నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ. 35,06,905.86** + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

ఐటెం నెం.1: కృష్ణా జిల్లా, విజయవాడ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ ఏరియా, పటమట సబ్-రిజిస్ట్రీ, కానూరు గ్రామ పంచాయితీ ఏరియా, కానూరు గ్రామం, సర్వే నెం. 25/6, 25/7 నందు 311.1 చ॥గ॥ లేదా 260.12 చ॥మీ॥ స్థలంలో అవిభాజ్యపు 45.0 చ॥గ॥ లేదా 37.62 చ॥మీ॥. హద్దులు: తూర్పు: ఇతరుల ఆస్తి-50.00 అ॥, దక్షిణం: ఎస్. శుష్మ ఆస్తి-57.00 అ॥, పడమర: 33 అ॥ వెడల్పు రోడ్డు -50.00 అ॥, ఉత్తరం: కంచర్ల విజయ సారధి ఆస్తి-55.00 అ॥. **ఐటెం నెం.2:** పైన తెలిపిన ఐటెం నెం.1లో నిర్మించిన "రియాన్ష్ ప్లాజా అపార్ట్‌మెంట్ ", మూడవ అంతస్తులోన ప్లింత్ ఏరియా 1280 చ॥అ॥, ఉమ్మడి ఏరియా 120.00 చ॥అ॥, యూసేజ్ ఏరియా 130.0 చ॥అ॥ మరియు కారు పార్కింగ్ 70.0 చ॥అ॥ గల **ఫ్లాట్ నెం. TF-1. హద్దులు:** తూర్పు: ఓపెన్ ఏరియా, మెట్లు, ఉమ్మడి ఏరియా, దక్షిణం: శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం, ఉత్తరం:శూన్యాకాశం.

తేది: 05-08-2023
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి,
కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
విజయవాడ ఎమ్‌పిఎఫ్ బ్రాంచ్
మిల్క్ ప్రాడక్ట్స్ ఫ్యాక్టరీ ప్రాంగణం, విజయవాడ-1. ఫోన్: 8331015691

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత(లు): శ్రీ అన్నం సుబ్బారావు మరియు శ్రీమతి అన్నం బిందు** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ. 49,11,381.86 (అక్షరాల నలభై తొమ్మిది లక్షల పదకొండు వేల మూడు వందల ఎనభై ఒక్క రూపాయలు మరియు ఎనభై ఆరు పైసలు)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది **10/04/2023న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **05.08.2023వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీతలు, హామీదారులు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీతలు, హామీదారులు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్, విజయవాడ ఎమ్‌పిఎఫ్ బ్రాంచ్** వారికి తేది. 04.08.2023 నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ. 49,98,454.86** + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

కృష్ణా జిల్లా, విజయవాడ ఈస్ట్ రిజిస్ట్రేషన్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, గుణదల సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్, ప్రసాదంపాడు గ్రామపంచాయితీ, ప్రసాదంపాడు గ్రామం, పాత అసెస్‌మెంట్ నెం. 966, క్రొత్త అసెస్‌మెంట్ నెం. 4869, పాత డోర్ నెం. 8-65, కొత్త డోర్ నెం. 18-77, సర్వే నెం. 77/1 నందు 97 చ॥గ॥ స్థలం. హద్దులు: తూర్పు: రయనపాటి కిరణ్ కుమార్ ఆస్తి - 27.0 అ॥ దక్షిణం: పొర్ల వేణు గోపాలరావు ఆస్తి - 32.3 అ॥, పడమర: 21 అ॥ పంచాయితీ రోడ్డు - 27.0 అ॥, ఉత్తరం: రయనపాటి కిరణ్ కుమార్ ఆస్తి - 32.3 అ॥. 30 చ॥గ॥ విస్తీర్ణంగల స్థలం హద్దులు: తూర్పు: 1వ ఐటమ్ ఆస్తి, దక్షిణం: జీరో పాయింట్, పడమర: 21 అ॥ పంచాయితీ రోడ్డు, ఉత్తరం: రయనపాటి కిరణ్ కుమార్ ఆస్తి.

తేది: 05-08-2023
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి,
కెనరా బ్యాంక్

సేంద్రియ చేనేత ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి

- చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె సునీత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సేంద్రియ పద్ధతుల్లో తయారైన చేనేత వస్త్రాలకు విదేశాల్లోనూ ఆదరణ ఉందని, ఆ దిశగా రైతులు, చేనేత కార్మికుల్లో అవగాహన కలిగిస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి కె సునీత తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని విజయవాడలోని స్టెల్లా మేరిస్ ఇండోర్ స్టేడియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత చేనేత ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఆర్గానిక్ హ్యాండ్‌లూమ్‌కు పెరుగుతున్న ప్రాచుర్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది 800 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో పత్తి సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహించామని, చేనేత రంగంలో ఆర్గానిక్ వస్త్రాల తయారీ మరెంతో దూరంలో లేదని వివరించారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా తయారు చేసిన నాణ్యమైన చేనేతకు ఎప్పుడూ డిమాండ్ వుంటుందని తెలిపారు. చేనేత వస్త్రాలకు జిఎస్‌టి మినహాయింపు విషయంలో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందన్నారు. చేతితో వడికిన వస్త్రాలకు, యంత్రాలతో చేసిన వస్త్రాలకు మధ్య తేడాను గుర్తించేలా తగిన పరిశోధనలను ఆహ్వానిస్తున్నామని, అప్పుడే జిఎస్‌టి విషయంలో ఓ నిర్ణయానికి వీలుంటుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. కొంతమంది వ్యాపారులు పవర్ లూమ్ వస్త్రాలను చేనేత వస్త్రాలుగా మార్కెటింగ్ చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆప్కో, చేనేతశాఖ సంయుక్తంగా ఈ నెల 12 వరకు ప్రత్యేక చేనేత ప్రదర్శన, విక్రయాలు జరుపుతున్నామన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ.. చేనేత సంప్రదాయ కళ అని, చేనేత వస్త్రాలు ధరించటం ఎంతో హుందాతనాన్ని ఇస్తాయని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో విదేశీ వస్త్ర వస్తు బహిష్కరణలో ఈ చేనేత చాలా ప్రాముఖ్యత పొందిందన్నారు. చేనేత జౌళిశాఖ కమిషనరు ఎంఎం నాయక్ మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలోనూ ఒక ముఖ్యమైన ఉత్పత్తిని గుర్తిస్తూ.. వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్ అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, ఎపి ఫైబర్ గ్రిడ్ ఛైర్మన్ పి గౌతంరెడ్డి, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు ఢిల్లీరావు మాట్లాడారు.

అంతకముందు రాష్ట్ర సచివాలయంలో జరిగిన చేనేత దినోత్సవం కార్యక్రమంలో ఉద్యోగులు ప్రతిశనివారం చేనేత వస్త్రాలను ధరించాలని కె సునీత కోరారు. రాష్ట్ర సచివాలయంలోని అప్కో కేంద్రంలో ఉద్యోగులకు 50 శాతం రిబేటుతో ఈ నెలాఖరు వరకు ఇస్తామన్నారు.

కృత్రిమ మేధస్సు ద్వారా విద్యాబోధన : సిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ద్వారా విద్యాబోధనను ఏవిధంగా అమలు చేయాలనే దానిపై పాఠశాల విద్య, కళాశాల విద్యాశాఖలు తగిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి సూచించారు. విద్యాశాఖలో కృత్రిమ మేధస్సు ఆధారిత విద్యాబోధన అంశం దాని కార్యాచరణపై సచివాలయంలో సోమవారం విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు అమలుకు సంబంధించి టెక్నికల్ బోర్డులను కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, దీనిపై తగిన ప్రతిపాదనలను పంపాలని అధికారులను ఆదేశించారు. ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్యామల రావు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుపై అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ కేంద్రాన్ని, టెక్నికల్ ల్యాబ్, పరిశోధనకు సంబంధించి విఆర్,ఎఆర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డి, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్,ఆ శాఖ మౌలిక వసతుల సదుపాయాల కమిషనర్ భాస్కర్, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరవ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తోనే న్యాయం : రుద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాంగ్రెస్ పార్టీతోనే మహిళాభ్యుదయం సాకారమవుతుందని, చట్ట సభల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించడం ద్వారానే వారికి పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షులుగా తాంతియా కుమారి ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా అధ్యక్షులు నెట్టా డిసౌజా తదితరులు మాట్లాడారు.

వ్యక్తిగత డేటాతో ఓటర్లను ప్రభావితం చేయొచ్చు

- వైసిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వ్యక్తిగత డేటాను వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వానికి వెసులుబాటు కల్పిస్తూ బిల్లును రూపొందించారని, కానీ దీనివల్ల అధికారంలో ఉన్న ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఓటర్లను ప్రభావితం చేయొచ్చని వైసిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం లోక్‌సభలో డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లుపై జరిగిన చర్చలో వైసిపి తరపున ఆయన మాట్లాడారు. బిల్లులో డేటా పోర్టబులిటీపై సరైన స్పష్టత లేదని అన్నారు. 18 ఏళ్లు నిండని ఒక వ్యక్తి సాధారణంగా తల్లిదండ్రుల ఆధీనంలోనే ఉంటారని, కనుక వీరి డేటా భద్రపరిచే విషయంలో తల్లిదండ్రుల అనుమతి పొందే విషయంలో బిల్లులో స్పష్టత లేదని అన్నారు. డేటా ప్రొటెక్షన్ బోర్డులో ఉండే వ్యక్తులు, కార్యనిర్వాహకులకు విస్తృత అధికారాలు ఉంటాయని, కనుక వారు ఏకపక్షంగా, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించి డేటా వినియోగించే పరిస్థితులు రావచ్చని అన్నారు. చట్టంలోని కొన్ని నిబంధనలకు మరింత స్పష్టత అవసరమని, ఇందులో హర్మ్ (హాని) అనే పదం చట్టంలో నిర్వచించలేదని పేర్కొన్నారు. ఇది తరువాత డేటా ఉల్లంఘన పరిణామాలను విశ్లేషించడంలో అడ్డంకి సృష్టించవచ్చని, కనుక హాని అనే పదానికి వివరంగా స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

వచ్చే ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం

(మొదటిపేజీ తరువాయి)

శోచనీయమన్నారు. జగన్ ప్రభుత్వం నూతన ప్రాజెక్టులు చేపట్టకపోగా ఉన్న ప్రాజెక్టులను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు సందర్శనకు ఎవరూ రాకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రాజెక్టులో జరుగుతున్న ఏ విషయాన్నీ బాహ్య ప్రపంచానికి తెలియనీయకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఛార్జీలు ఎనిమిదిసార్లు పెంచారని, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు పెట్టి రైతులకు ఉరితాళ్లు వేస్తున్నారని తెలిపారు. రైతులకు ఏడాదికి రూ.20 వేల సాయం అందజేస్తామని, యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని, రాష్ట్రానికి ప్రముఖ కంపెనీలను తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామని, వర్క్ ఫ్రం హోమ్‌కు శ్రీకారం చుడతానని హామీ ఇచ్చారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరి బ్రాంచ్ (కోడ్ నం.05173)
నం.11/90, 3వ అంతస్తు, ట్రస్ట్ వెల్ హాస్పిటల్ ఎదురు, జె.సి.రోడ్డు, బెంగళూరు-560 002.
టెలి : 080- 25943663, ఫ్యాక్స్.నం.080-25943664, ఇ మెయిల్ ఐడి : sbi.05173@sbi.co.in

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఆతరువాత 'చట్టం'గా పిలుస్తారు) యొక్క సెక్షన్ 13 సబ్ సెక్షన్ (2) క్రింద)

బ్యాంక్ నుండి వారి ద్వారా పొందిన రుణాల సౌకర్యాల అసలు మరియు వడ్డీ యొక్క పునఃచెల్లింపులు దిగువ రుణగ్రహీత/లు విఫలమైనారని నోటీసు ఇవ్వబడింది మరియు రుణాలు నాన్ ఫర్‌ఫార్మింగ్ అస్సెట్స్ (ఎన్‌పిఎ)గా వర్గీకరించడమైనది. వారి చివరి చిరునామాలకు సెక్యూరిటీజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002, సెక్షన్ 13(2) క్రింద వారికి నోటీసులు జారీచేయడమైనది, కాని తీసుకోకపోవడంవలన తిరిగివచ్చినవి మరియు అందువలన ఈ పబ్లిక్ నోటీసు ద్వారా ఇక్కడ తెలియజేయుచున్నాము.

క్ర. సం.	రుణగ్రహీత, హామీదారులు, తనఖాదారుల పేర్లు మరియు చిరునామా మరియు లోన్ ఎకౌంట్ నం.	అస్తుల వివరాలు/రుణగ్రహీత అమలు చేయబడిన సెక్యూర్డ్ అసెట్ల చిరునామా	నోటీసు తేది	ఎన్‌పిఎ తేది	బకాయి మొత్తం (నోటీసు తేది నాటికి)
1	ఎకౌంట్ నం.: TL 37556048243, TL 39432147933 HL 64214144423 రుణగ్రహీత : మెసెర్స్ మోజోల్యాండ్ ఇండియా లిమిటెడ్, సి-300, సురజ్‌మల్ విహార్, న్యూ ఢిల్లీ-110092. ఇక్కడ కూడా : కుడి చేతి వైపు, కెఎమ్-54-110, భిగన్ గ్రామం, తెహసిల్, గనౌర్, ఎన్‌హెచ్-1, సోనిపాట్, హర్యాణ-131039. రుణగ్రహీతలు : 1) శ్రీ. గోగాడ సుబ్బారావు, తండ్రి. నారాయణ, ప్లాట్ నం.204, జాస్మిన్ సౌత్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు, గుంటూరు జిల్లా, ఎపి-522003. ఇక్కడ కూడా : ఫ్లాట్ నం.సి-5, "హని రెసిడెన్సీ", కృష్ణానగర్, 6వ లైన్, గుంటూరు, ఎపి-522003. 2) శ్రీమతి. లక్ష్మి తాపాటి మందవ, భర్త. ఎమ్.వెంకటేశ్వరరావు, డైరెక్టర్. మెసెర్స్ మోజోల్యాండ్ ఇండియా లిమిటెడ్., ఫ్లాట్ నం.1501, ఐ బ్లాక్, ఎన్‌సిసి మీడౌన్స్-2, ఎలహంక, బెంగళూరు-560064. ఇక్కడ కూడా : ఎ) 101, "శ్రీ బాలాజీ ఇంద్రప్రస్త", 1-1-508-1, బకరం, ముషీరాబాద్, హైదరాబాద్-500080. బి) ఫ్లాట్ నం.1501, ఐ బ్లాక్, నాగార్జున మీడోస్-2, పుట్టెనహల్లి, యేలాహంక, బెంగళూరు నార్త్-560064. సి) ప్లాట్ నం.100, హుడా హైట్స్, లోటస్ పౌండ్ ఎమ్ఎల్ఎ కాలనీ రోడ్డు, బంజారా హిల్స్, హైదరాబాద్-500034. డి) 2వ అంతస్తు, శ్రీ వెంకటేశ్వర కాంప్లెక్స్, కకోల్ రోడ్డు, రాజనుకుంటే, బెంగళూరు-560064. 3) శ్రీ. శ్రీహర్ష మందవ, తండ్రి. ఎమ్.వెంకటేశ్వరరావు, డైరెక్టర్. మెసెర్స్. మోజోల్యాండ్ ఇండియా లిమిటెడ్., 101, "శ్రీ బాలాజీ ఇంద్రప్రస్త", 1-1-508-1, బకరం, ముషీరాబాద్, హైదరాబాద్-500080. ఇక్కడ కూడా : నం.201, జోహరి మ్యాన్షన్, 259, కోలాబదేవి రోడ్డు, ముంబై-400002. 4) శ్రీ. సుజిత్ సాగర్ పచ్చిపులుసు, తండ్రి. శ్రీ.విద్య సాగర్ వచ్చిపులుసు, డైరెక్టర్.మెసెర్స్. మోజోల్యాండ్ ఇండియా లిమిటెడ్., నం.2010, "ఎల్డెకో కౌంటి", సెక్టార్-19, జిటి, కమల్ రోడ్డు, ఎన్‌హెచ్-1, సోనిపట్, హర్యాణ-131001. 5). శ్రీ. వాసు ఉత్ర, తండ్రి. రామ్ గోపాల్ ఉత్ర, డైరెక్టర్. మెసెర్స్. మోజోల్యాండ్ ఇండియా లిమిటెడ్, సి-300, యమున స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద, సురజ్‌మల్ విహార్, తూర్పు ఢిల్లీ, ఢిల్లీ-110092. ఇక్కడ కూడా : ఇ-336, ఎల్ఇపిసిఎల్-1, నిర్మాన్ విహార్, వికాస్ మార్గ్, ఢిల్లీ-110092. 6) శ్రీ. పచ్చి పులుసు విద్యాసాగర్, తండ్రి. శ్రీ.శంకరనారాయణ, 31-4-8/1, ఫ్లాట్ నం.302, "శ్రీ కార్తిక్ రెసిడెన్సీ", గద్దె పూర్ణచంద్రరావు వీధి, ఏలూరు రోడ్డు, మారుతి నగర్, నోబెల్ పబ్లిక్ స్కూల్ వద్ద, విజయవాడ అర్బన్, కృష్ణాజిల్లా, ఎపి-520004. 7) కెయిఎమ్. స్నేహ మందవ, తండ్రి. శ్రీ.ఎమ్.వెంకటేశ్వరరావు, నం.2010, "ఎల్‌డెకో కౌంటీ", సెక్టార్-19, జిటి, కమల్ రోడ్డు, ఎన్‌హెచ్-1, సోనిపాట్, హర్యాణ-131001. ఇక్కడ కూడా : ఫ్లాట్ నం.ఇ-207 తో వేరే 1వ అంతస్తులో మున్సిపల్ నం.1-1-508/1/1/ఇ-207, బ్లాక్ ఇ, "శ్రీ బాలాజీ ఇంద్రప్రస్త", బకరం, ముషీరాబాద్, హైదరాబాద్-500080. 8) మెసెర్స్. ఏస్ సిండికేట్ ఎల్ఎల్‌పి, ఇ-336, గ్రౌండ్ ఫ్లోర్, నిర్మన్ విహార్, ఢిల్లీ-110092.	భాగం-1 : హర్యాణ-131039, సోనిపట్, భిగన్ గ్రామం, కె.ఎమ్. 54.110 లో ఉన్న లీజ్ స్థలం మీద స్నో సిటీ నిర్మాణం కొరకు అన్నీ ఆస్తులు బ్యాంక్ ఫైనాన్స్ నుండి సృష్టించబడ్డాయి. భాగం-2 : ఆస్తి నం.1 : ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, గుంటూరు ఉపజిల్లా, టౌన్ సర్వే నిర్వహించని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, ఆర్. అగ్రహారం గ్రామం వద్ద ఉన్న సర్వే నం.54/1బి, 59/2 లోని స్థిరాస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ డో.నం.25-19-21 వద్ద కొలిచే విస్తీర్ణం 1500 చ.గ.లు. లేదా 1254.15 చ.మీ.లు., శ్రీ. గోగడ సుబ్బారావు, తండ్రి. నారాయణ పేరు మీద ఉన్న క్రింది విధమైన సరిహద్దులు : తూర్పు: 30 అ.లు. వెడల్పు రోడ్డు 41'.00", పడమర: త్రిపుర మల్లు మురళీధర్ స్థలం 40'.00", ఉత్తరం: పీకలవాగు 333'.03", దక్షిణం: మరిబోయిన కోటేశ్వరరావు సైట్ 333'.03". శ్రీ. గోగాడ సుబ్బారావు, తండ్రి. నారాయణ కు అనుకూలంగా రిజిస్టర్ చేయబడిన ఆస్తి వైడ్ సేల్ డీడ్ 23.02.2016న బుక్ నం.1 సిఎస్ నం.1914/2016 మరియు డాక్యుమెంట్ నం.1752/2016లో ఉమ్మడి రిజిస్ట్రార్ ఆర్.ఓ.గుంటూరు కార్యాలయం వద్ద రిజిస్టర్డ్ చేయబడినది. ఆస్తి నం.2 : గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుత తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, బకరం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ వేరే మున్సిపల్ నం.1-208/1/1/ఇ-207, ప్రాంగణం బేరింగ్ నం.1-1-508/1,1-1-508/1/1, 1-1-508/1/2, 1-1-508-1/3, కుం. మందవ స్నేహ, తండ్రి. శ్రీ.ఎమ్.వెంకటేశ్వరరావు పేరు మీద ఉన్న "శ్రీ.బాలాజీ ఇంద్రప్రస్త"గా పేర్కొనబడే 1వ అంతస్తులో, రెసిడెన్షియల్ ఫ్లాట్ నం.ఇ-207 తో బ్లాక్ ఇ తో బిల్డప్ ఏరియా 732.5 చ.అ.లు. (బాల్కానీ మరియు కామన్ ఏరియా మినహాయించి) మరియు బాల్కానీలు మరియు కామన్ ఏరియా 157.5 చ.అ.లు. తో అవిభక్త వాటా స్థలం 27.4 చ.గ.లు. మరియు హద్దులు : ఉత్తరం: ఫ్లాట్ నం.ఇ-206, దక్షిణం: ఫ్లాట్ నం.ఇ-208, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: కారిడార్ మరియు గిఫ్ట్ సెట్టిల్‌మెంట్ డీడ్ కు అనుబంధించబడిన ప్లాన్‌లో మరింత స్పష్టంగా వివరించబడింది. కం. మందవ స్నేహ, తండ్రి. శ్రీ.ఎమ్.వెంకటేశ్వరరావుకు అనుకూలంగా రిజిస్టర్డ్ ఆస్తి వైడ్ గిఫ్ట్ సెట్టిల్‌మెంట్ డీడ్ తేది 09.02.2012న బుక్ నం.1 లో రిజిస్టర్ చేయబడిన డాక్యుమెంట్ నం.406/2012 మరియు 09.02.2012న చిక్కడ్ పల్లి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద అసైన్ చేయబడిన గుర్తింపు నం.1602-ఐ-406/2012. ఆస్తి నం.3 : షెడ్యూల్ 'ఎ' ఆస్తి అంశం నం.1 : బెంగళూరు, బెంగళూరు నార్త్ తాలూక, ఏలహంక హొబ్లి, పుట్టెనహల్లి గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ ఎస్‌వై.నం.81 భాగంలో రెసిడెన్షియల్ గా మార్చబడిన స్థలం, మరియు హద్దులు : తూర్పు: బెంగళూరు-దొడ్డబల్లాపూర్ రోడ్డు, పడమర: కె.వి.జయమ్మ కి చెందిన ఎస్‌వై.నం.81 మిగిలిన భాగం, ఉత్తరం: ఎన్‌సిసిఎల్‌కి చెందిన ఎస్‌వై.నం.81 మిగిలిన భాగం, దక్షిణం: ఎస్‌వై.నం.80. అంశం నం.2 : బెంగళూరు, బెంగళూరు నార్త్ తాలూక, ఏలహంక హొబ్లి, పుట్టెనహల్లి గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ ఎస్‌వై.నం.81 భాగంలో రెసిడెన్షియల్ గా మార్చబడిన స్థలం కొలిచే 38 గుం.లు., మరియు హద్దులు : తూర్పు: కె.వి.వేణుగోపాల్‌కి చెందిన ఎస్‌వై.నం.81 మిగిలిన భాగం, పడమర: అనంతపుర గ్రామం సరిహద్దు, ఉత్తరం: ఎన్‌సిసిఎల్ కి చెందిన ఎస్‌వై.నం.81 మిగిలిన భాగం, దక్షిణం: ఎస్‌వై.నం.80. అంశం నం.3 : బెంగళూరు, బెంగళూరు నార్త్ తాలూక, ఏలహంక హొబ్లి, పుట్టెనహల్లి గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ పార్సిల్ ఎస్‌వై.నం.81 భాగంలో రెసిడెన్షియల్ గా మార్చబడిన స్థలం కొలిచే 01 ఎకరాలు, 32 గుం.లు., మరియు హద్దులు : తూర్పు: బెంగళూరు-దొడ్డబల్లాపూర్ రోడ్డు, పడమర: అనంతపుర గ్రామం సరిహద్దు, ఉత్తరం: ఎన్‌సిసిఎల్ కి చెందిన ఎస్‌వై.నం.81 మిగిలిన భాగం, దక్షిణం: కె.వి.వేణుగోపాల్ కి చెందిన ఎస్‌వై.నం.81 మిగిలిన భాగం. అంశం నం.4 : బెంగళూరు, బెంగళూరు నార్త్ తాలూక, ఏలహంక హొబ్లి, పుట్టెనహల్లి గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ పార్సిల్ ఎస్‌వై.నం.81 భాగంలో రెసిడెన్షియల్ గా మార్చబడిన స్థలం కొలిచే 01 ఎకరాలు, 22 గుం.లు., మరియు హద్దులు : తూర్పు: బెంగళూరు-దొడ్డబల్లాపూర్ రోడ్డు, పడమర: అనంతపుర గ్రామం సరిహద్దు, ఉత్తరం: ఎన్‌సిసిఎల్ కి చెందిన ఎస్‌వై.నం.82 లో స్థలం, దక్షిణం: కె.వి.వేణుగోపాల్ కి చెందిన ఎస్‌వై.నం.81 మిగిలిన భాగం. అంశం నం.5 : బెంగళూరు, బెంగళూరు నార్త్ తాలూక, ఏలహంక హొబ్లి, పుట్టెనహల్లి గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ పార్సిల్ ఎస్‌వై.నం.82 భాగంలో రెసిడెన్షియల్ గా మార్చబడిన స్థలం కొలిచే 21 గుం.లు. మరియు హద్దులు : తూర్పు: బెంగళూరు-దొడ్డబల్లాపూర్ రోడ్డు, పడమర: అనంతపుర గ్రామం సరిహద్దు, ఉత్తరం: శ్రీ.పి.ఎమ్.లీలకి చెందిన ఎస్‌వై.నం.82 మిగిలిన భాగం, దక్షిణం: ఎన్‌సిసిఎల్ కి చెందిన ఎస్‌వై.నం.81 లో స్థలం. షెడ్యూల్ 'బి' ఆస్తి : పైన పేర్కొన్న షెడ్యూల్ 'ఎ' ఆస్తిలో అవిభక్త హక్కు మరియు ఇంట్రస్ట్ ఈ డీడ్ 395.46 చ.అ.ల క్రింద కవర్‌చేయబడిన ఆస్తి. షెడ్యూల్ 'సి' ఆస్తి : షెడ్యూల్ 'ఎ' ఆస్తి పై నిర్మించబడిన 'నాగార్జున మీడోస్-2' గా పేర్కొనబడే ప్రాజెక్ట్‌లో బ్లాక్-1 యొక్క అపార్ట్‌మెంట్ బేరింగ్ నం.1501 పద్నాలుగోవ అంతస్తు కొలిచే సూపర్ బిల్డప్ ఏరియా 1521 చ.అ.లు. కలిగి ఉన్న మూడు బెడ్ రూములు, దామాషా వాటా తో సహా కామన్ ఏరియాలతో పాటు ఒక కార్ పార్కింగ్ ప్రదేశం. వెట్రిఫైడ్/సెరామిక్ టైల్స్ ఫ్లోరింగ్ తో కలిగి ఉన్న ఆర్‌సిసి అపార్ట్‌మెంట్, తో శ్రీమతి. మందవ లక్ష్మి తపతి, భర్త. శ్రీ.ఎమ్.వెంకటేశ్వరరావు పేరు మీద ఉన్న దానిపై భవనం మరియు హద్దులు : తూర్పు: కారిడార్, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై. తేది 26.09.2014న బెంగళూరు, మల్లేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సిడి నం.ఎమ్ఎల్ఎస్‌డి90లో ఉంచిన డాక్యుమెంట్ నం.ఎమ్ఎల్ఎస్-1-01960-2014-15 క్రింద బ్లాక్ నం.1లో శ్రీమతి. మందవ లక్ష్మి తపతి, భర్త. శ్రీ.ఎమ్.వెంకటేశ్వరరావు కి అనుకూలంగా తేది 26.09.2014న రిజిస్టర్ చేయబడిన పూర్తి సేల్ డీడ్.	సర్ఫేసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద 14.07.2023 పర్యవసానంగా ఈ నోటీసు, మా డిమాండ్ నోటీసు తేది 15.01.2021 మరియు 15.04.2021న జారీ చేయబడ్డాయి మరియు తదుపరి చర్య ఉపసంహరించబడింది.	21.12.2020	(మెసెర్స్.మోజోల్యాండ్ ఇండియా లిమిటెడ్., యొక్క మొత్తం లోను బకాయిలు) రూ.8,01,50,952/- - (ఎనిమిది కోట్ల ఒక లక్షా యాభై వేల తొమ్మిది వందల యాభై రెండు రూపాయలు మాత్రమే) 09.07.2023 నాటికి మరియు 10.07.2023 నుండి కాంట్రాక్టువల్ రేటు వద్ద భవిష్యత్తు వడ్డీ తో యాధృచ్ఛిక ఖర్చులు, ఖర్చులు, ఛార్జీలు మొదలైనవి. (శ్రీమతి. లక్ష్మి తపతి మందవ యొక్క హౌసింగ్ లోన్ బకాయి) రూ.58,10,583/- (యాభై ఎనిమిది లక్షల పది వేల ఐదు వందల ఎనభై మూడు రూపాయలు మాత్రమే) 09.07.2023 నాటికి మరియు 10.07.2023 నుండి కాంట్రాక్టువల్ రేటు వద్ద భవిష్యత్తు వడ్డీ తో యాధృచ్ఛిక ఖర్చులు, ఖర్చులు, ఛార్జీలు మొదలైనవి.

నోటీసు కొరకు తదుపరి సర్వీస్ చర్యలు తీసుకుంటున్నారు. ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోపు బకాయి ఉన్న మొత్తాన్ని చెల్లించుటకు పై రుణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులు పిలువడమైనది. లేని పక్షంలో సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 లోని సబ్ సెక్షన్ (4) క్రింద ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోపు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు సర్ఫేసీ చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

ప్రదేశం: బెంగళూరు
తేది: 14.07.2023

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ శాఖ, బెంగళూరు.



విజయనగరం కలెక్టరేట్ ఎదుట పొర్లుదండాలు పెడుతున్న కార్మికులు



విశాఖలో మహిళా కార్మికులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

దద్దరిల్లిన కలెక్టరేట్లు

- సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కిన మున్సిపల్ కార్మికులు
- పోలీసుల అడ్డగింతలు, తోపులాటలు - మహిళా కార్మికులపై పోలీసుల దాష్టీకం
- 17న చలో విజయవాడ : ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా కదం తొక్కారు. పర్మినెంట్ చేయాలని, 010 పద్దు క్రింద జీతాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని, చెత్త తరలించే వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు, యుజిడి కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు కలెక్టరేట్లను ముట్టడించారు. అనంతపురం, కడప, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒంగోలు కలెక్టరేట్ల వద్దకార్మికులపై పోలీసులు విరుచుకుపడ్డారు. పిడుగుద్దులు గుద్దడం, గోళ్లతో రక్కడంతో అనేక మంది కార్మికులకు గాయాలయ్యాయి. మహిళా కార్మికులను మగ పోలీసులు నెట్టేయడం, వ్యాన్‌లోకి బలవంతంగా ఎక్కించడం వంటి చర్యలకు పాల్పడ్డారు. వందల మంది కార్మికులను, నాయకులను అరెస్టు చేశారు.

అనంతపురంలో సంగమేష్ సర్కిల్ నుంచి కార్మికులు ర్యాలీగా కలెక్టరేట్ చేరుకున్నారు. అప్పటికే పోలీసులు మోహరించడంతో నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు సిఐటియు నాయకులు, కార్మికులు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొంది. తోపులాటలో నాయకులు, కార్మికులకు గాయాలయ్యాయి. మహిళా కార్మికులను పోలీసులు కాళ్లతో తన్ని రోడ్డుపై ఈడ్చిపారేశారు. సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.రాంభూపాల్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ సిఐటియు జిల్లా అధ్యక్షులు నాగమణితో పాటు పలువురు కార్మికులు స్పృహతప్పి పడిపోయారు. అయినా, పోలీసులు వెనక్కి తగ్గకుండా అరెస్టుల పర్వం కొనసాగించారు. కడప కలెక్టరేట్ ఎదుట సుమారు మూడు గంటలపాటు కార్మికులు ఆందోళన నిర్వహించారు. అధికారులు నుంచి స్పందన లేకపోవడంతో నాయకులు, కార్మికులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకున్నారు. దొరికిన వారిని దొరికినట్టు ఈడ్చుకువెళ్లే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో నలుగురు కార్మికులు గాయపడ్డారు. ఫెడరేషన్ కడప నగర అధ్యక్షులు సుంకర రవి భుజానికి గాయమైంది. పోలీసుల తోపులాటలో కార్మికుల చొక్కాలు చిరిగిపోయాయి. పోలీసుల వాహనానికి అడ్డుగా నిలిచిన మహిళా కార్మికులను మగపోలీసులు నెట్టివేశారు.

ఒంగోలు కలెక్టరేట్ కార్మికుల నినాదాలతో మార్మోగింది. పోలీసులు బారికేడ్లను తోసుకుంటూ కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించిన సిఐటియు, మున్సిపల్ యూనియన్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వ్యాన్‌కు కార్మికులు అడ్డు తగిలారు. కొద్దిసేపటి తరువాత వారిని విడుదల చేశారు. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరులో కార్మికులు ఆందోళనలు చేపట్టారు. ఏలూరులో నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కలెక్టరేట్ ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. సుమారు రెండు గంటల పాటు కార్మికులు అక్కడే మండుటెండలో బైఠాయించి నిరసన తెలిపారు.

విశాఖలో ఒక రోజు టోకెన్ సమ్మె చేశారు. సరస్వతీ పార్కు నుంచి విశాఖ కలెక్టరేట్ వరకూ ర్యాలీగా వెళ్తున్న వందలాది మంది కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. సుమారు 200 మందిని పోలీసులు అరెస్టు చేసి జిల్లాలోని పలు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మహిళలపై మగ పోలీసులు చేయిచేసుకోవడం, దొరికినవారిని దొరికినట్లుగా వ్యాన్‌లోకి ఎత్తిపడేయడం పోలీసుల దాష్టీకానికి పరాకాష్టగా నిలిచింది. అరెస్టయిన వారిలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్‌తో పాటు పలువురు కార్మికులు ఉన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మద్దతు తెలిపారు.

కాకినాడ జిల్లా కాకినాడ ధర్నా చౌక్ వద్ద, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లా అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ వద్దధర్నాలు నిర్వహించారు. అమలాపురంలో నిర్వహించిన ధర్నాలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు నెలకు రూ.18,500 వేతనం చెల్లించాలన్నారు. శ్రీకాకుళంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి కలెక్టరేట్ వరకు కార్మికులు ప్రదర్శనగా తరలివచ్చారు. పోలీసులను ప్రతిఘటిస్తూ కలెక్టరేట్‌లోకెళ్లేందుకు కార్మికులు ప్రయత్నించడంతో సుమారు 101 మందిని అరెస్టు చేశారు. విజయనగరంలో అధికారులు స్పందించకపోవడంతో జాతీయ రహదారిపై బైఠాయించి పొర్లు దండాలతో కార్మికులు నిరసన తెలిపారు. దీంతో పలువురు కార్మికులును పోలీసులు అరెస్టు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌ను కార్మికులు ముట్టడించారు. దీంతో కార్మికులు, నాయకులతో కలిసి సుమారు 53 మందిని స్టేషన్‌కు తరలించారు.పల్నాడు జిల్లా నరసరావుపేటలో మున్సిపల్ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్మికుల నినాదాలతో కలెక్టర్ బయటకు వచ్చారు. మీ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని, స్థానిక సమస్యలు పరిష్కారం చేస్తానని తెలిపారు. గుంటూరులో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు.

విజయవాడ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావుకు వినతిపత్రాలను అందజేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. 17న చలో విజయవాడకు పిలుపునివ్వడం జరిగిందని, పెద్ద ఎత్తున కార్మికులు తరలిరావాలని కోరారు. అప్పటికీ ప్రభుత్వం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆ తరువాత ఏ నిమిషంలోనైనా కార్మికులు సమ్మెలోకి వెళ్తారని హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర నాయకులు బాబూరావు మాట్లాడుతూ... వివిధ విభాగాల కార్మికులకు నాలుగేళ్లలో నయా పైసా జీతం పెంచలేదని, నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

దాడి అమానుషం : సిపిఎం

శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులపై పోలీసులు దాడి చేయడం, మహిళలను కూడా చూడకుండా మగ పోలీసులు బూటుకాళ్లతో తన్నడం అమానుషమని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటన విడుదల చేశారు. కరోనాలో తమ ప్రాణాలు పణంగా పెట్టి పనిచేసినందుకు ప్రభుత్వం ఈ విధంగా చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి కార్మికుల డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఐటియు ఖండన

మున్సిపల్ కార్మికులు, విద్యుత్ ఉద్యోగులు, విఆర్‌ఎలపై ప్రభుత్వ నిర్బంధకాండను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో ఖండించారు. మహిళలపై మగ పోలీసులు చేయిచేసుకోవడం, దొరికినవారిని దొరికినట్లుగా వ్యాన్‌లోకి ఎత్తిపడేయడంపై మండిపడ్డారు. మున్సిపల్ కార్మికుల, విద్యుత్ ఉద్యోగుల, విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం, బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

పరిశ్రమలను రక్షించాలి.. ఉపాధిని కాపాడాలి

- అనకాపల్లి, విజయనగరంలో కలెక్టరేట్ల వద్ద ఫెర్రో ఎల్లాయీస్ కార్మికుల ధర్నా



విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఫెర్రో ఎల్లాయిస్ కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/అనకాపల్లి

ఫెర్రో ఎల్లాయీస్ కార్మికుల ఉపాధిని కాపాడాలని, పరిశ్రమలకు పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన అనకాపల్లి, విజయనగరం కలెక్టరేట్ల ఎదుట ఎపి స్టేట్ ఫెర్రో ఎల్లాయీస్ కార్మిక కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ధర్నా చేశారు. విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఎపి ఫెర్రో ఎల్లాయిస్ కార్మిక కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ టివి రమణ మాట్లాడుతూ.. విద్యుత్ భారాలతో ఇప్పటికే విజయనగరం జిల్లాలో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఐదు, గరివిడి ప్రాంతంలో నాలుగు, కొత్తవలసలో ఒక పరిశ్రమ మూతపడ్డాయన్నారు. మరి కొన్ని పరిశ్రమలు ఉత్పత్తిని తగ్గించాయని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలను నడపలేమని ఫెర్రో యాజమాన్యాలు ప్రకటించాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ పరిశ్రమలకు పెంచిన విద్యుత్ ఛార్జీల ధరలను తగ్గించి ఫెర్రో పరిశ్రమను రక్షించాలని, కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరారు.

అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడంతో పరిశ్రమలు విలవిల్లాడుతున్నాయన్నారు. ముడి సరుకు ధరలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో ఉత్పత్తుల ధరలు తగ్గడంతో ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు సంక్షోభం దిశగా నడుస్తున్నాయని తెలిపారు. దీంతో కార్మికులు తమ జీవనోపాధిపై భయాందోళన చెందుతున్నారని అన్నారు. జిల్లాలో పరిశ్రమలు మూతపడే దిశగా నడుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించి పరిశ్రమలను కాపాడి కార్మికుల ఉపాధికి ఢోకా లేకుండా చూడాలని కోరారు. అనంతరం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి వినతిపత్రం అందజేశారు.

అగ్రిగోల్డు ఆస్తుల జప్తుపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

అగ్రిగోల్డ్ ఆస్తుల వేలం ప్రక్రియ హైకోర్టు పర్యవేక్షణలో జరిగిన తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరు సదరు ఆస్తులను జప్తు చేయడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము ఆదేశాలు చేయడమే కాకుండా స్వీయ పర్యవేక్షణలో నిర్వహించిన వేలంలో కొన్న ఆస్తులను జప్తు చేయడం కోర్టుధిక్కారం అవుతుందని అభిప్రాయబడింది. ఇది కోర్టు విధుల్లో జోక్యం చేసుకోవడమేనని పేర్కొంది. డిపాజిటర్లకు చెల్లింపులు ఎగవేసిన నేపథ్యంలో సిఐడి గతంలోనే జప్తు చేసిన అగ్రిగోల్డు సంస్థ ఆస్తులను ఇడి మరోసారి జప్తు చేస్తూ జారీ చేసిన ప్రాథమిక ఉత్తర్వులను సవాల్ చేసిన కేసుల్లో హైకోర్టు వాదన ముగించింది. తీర్పు తర్వాత వెలువరిస్తామని ప్రకటించింది. అగ్రిగోల్డు కుంభకోణానికి ముందే గతంలో తాము కొన్ని ఆస్తులను సిఐడి జప్తు చేయడాన్ని సవాలు చేస్తూ పలువురు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో కూడా వాదనలు ముగిశాయి. పిటిషన్లు, సిఐడి, ఇడి, బ్యాంకుల వాదనల అనంతరం తీర్పును వాయిదా వేస్తున్నట్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

టిటిడి ప్రత్యేక ఆహ్వానితులపై పిల్ విచారణ 11కి వాయిదా

టిటిడిలోకి ప్రత్యేక ఆహ్వానితులను ప్రభుత్వం నియమించే ప్రయత్నాలను అడ్డుకోవాలనే కేసు విచారణ ఈ నెల 11కి వాయిదా పడింది. గతంలో తాము దాఖలు చేసిన వ్యాజ్యాలపై అత్యవసరంగా విచారించాలని పలువురు పిటిషనర్లు హైకోర్టును అభ్యర్థించారు. మరోవైపు టిటిడి బోర్డులో నేరచరితులను నియమించడాన్ని సవాల్ చేస్తూ బిజెపి అధికార ప్రతినిధి జి భానుప్రకాశ్ రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు.



కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న విఆర్‌ఎలు

హామీలు అమలు చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద విఆర్‌ఎల ఆందోళనలు, నిరసన దీక్షలు

ప్రజాశక్తి-యంత్రాంగం

తెలంగాణలో మాదిరిగా విఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హత ఉన్న విఆర్‌ఎలకు విఆర్‌ఒలుగా ప్రమోషన్ ఇవ్వాలని, నామినీలుగా పని చేస్తున్న విఆర్‌ఎలను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా విఆర్‌ఎలు రెండు రోజులపాటు నిరసన దీక్షలకు దిగారు. ఎపి గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం ఆధ్వర్యంలో ఈ దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ విఆర్‌ఎల పట్ల నిర్లక్ష్య వైఖరి అలంబించకుండా గత ఎన్నికల సందర్భంగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో విఆర్‌ఎలు చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీల్లో భాగంగా విఆర్‌ఎలకు ప్రమోషన్లు కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, డిఎను కొనసాగించాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో కలెక్టరేట్ ఆవరణలో నిరసన దీక్షలు చేపట్టిన విఆర్‌ఎలకు టెంట్ వేసుకునేందుకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో సమీపంలోనే మొక్కల మధ్య విఆర్‌ఎలు కూర్చుని నిరసన దీక్షలు ప్రారంభించారు. ఏలూరులో సామూహిక నిరాహార దీక్షలు ప్రారంభించారు. కాకినాడ, తూర్పుగోదావరి, కర్నూలు, నంద్యాల, గుంటూరు, పల్నాడు, చిత్తూరు, తిరుపతి, కడప, ప్రకాశం, నెల్లూరు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నిరసన దీక్షలు చేపట్టారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద విఆర్‌ఎలు బైఠాయించి ఆందోళన చేశారు. అనకాపల్లి కలెక్టరేట్, విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం, పాడేరులోని ఐటిడిఎ కార్యాలయం వద్ద ధర్నాలు చేసి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

చేనేతలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చేనేతలను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని టిడిపి నేతలు విమర్శించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా చేనేతలు అత్యంత దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చేనేతల నుంచి వచ్చే నాయకుల్ని జగన్ అణచివేసేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మవరానికి చెందిన వ్యాపారులపై విజయవాడలో చేసిన దాడే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ.. టిడిపి హయాంలో అందించిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలను వైసిపి ప్రభుత్వం ఎత్తేసి చేనేతల ఉసురు తీస్తోందని అన్నారు. మంగళగిరిలో చేనేత భవనం కూల్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాల్, టిడిపి బిసి సెల్ ఉపాధ్యక్షులు కాండ్రు శ్రీనివాసరావు, పార్టీ అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, నేతలు నందం అబద్దయ్య, గంజాం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : అశోక్‌బాబు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను పరిష్కరించాలని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు డిమాండ్ చేశారు. లేదంటే జగన్ భారీ మూల్యం చెల్లించుకుంటారని విలేకరుల సమావేశంలో హెచ్చరించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలతో విద్యుత్ ఉద్యోగులను అణచివేయాలని సిఎం చూస్తున్నారని అన్నారు.

చేనేత కుటుంబాలకు అండగా నిలబడాలి

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చేనేత కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలబడాలని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సునిశితమైన హస్తకళలకు పుట్టినిల్లు భారతదేశమని, అటువంటి కళల్లో ముఖ్యమైంది చేనేత కళ అని పేర్కొన్నారు. అగ్గిపెట్టెలో పట్టు చీరను మన నేత కళాకారులు రూపొందిస్తే ఆ గొప్పతనాన్ని చూసి ప్రపంచం అబ్బురపడిందన్నారు. ప్రజలంతా విధిగా వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరించాలని, చారిత్రక నేపథ్యమున్న చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా తనకు తానుగా అంకితం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే

- మోడీ రద్దు చేసిన చేనేత పథకాలన్నీ తీసుకొస్తాం : మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటి రామారావు అన్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో బిఆర్‌ఎస్ కీలక పాత్ర పోషించనుందని, మోడీ రద్దు చేసిన సంక్షేమ పథకాలన్నీ తిరిగి తీసుకొస్తామని చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం మన్నెగూడలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కెటిఆర్ మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులపై ఐదు శాతం జిఎస్‌టి వేయడంతోపాటు పలు సంక్షేమ పథకాలను మోడీ ప్రభుత్వం తొలగించిందన్నారు. ఇప్పటివరకు ఏ ప్రధానీ ఇలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. చేనేత వద్దు... అన్నీ రద్దు అనేలా కేంద్రం తీరు ఉందని, కేంద్రానికి, అక్కడ పెద్దలకు నేత తెలవదని, నేతన్నల కష్టాలు తెలియవని విమర్శించారు. నేతన్నల సంక్షేమం, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి మగ్గానికీ ప్రతి నెలా రూ.3 వేల చొప్పున వచ్చే నెల నుంచి నేత కార్మికులకు అందజేస్తామని ప్రకటించారు. 75 ఏళ్ల దాటిన చేనేత కార్మికులకు ప్రభుత్వమే బీమా కల్పిస్తుందని వెల్లడించారు.

ప్లేట్ భోజనం భారం

- నెలలో 34% వ్యయం పెరుగుదల
- క్రిసిల్ రిపోర్ట్

న్యూఢిల్లీ : శాఖహార భోజనం ప్రియమయ్యింది. ఈ ఏడాది జూన్‌తో పోల్చితే జులైలో ప్లేట్ అహారం వ్యయం 34 శాతం పెరిగిందని ప్రముఖ విశ్లేషణ సంస్థ క్రిసిల్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఇందులో 25 శాతం టమాట ధరలు పెరగడం ద్వారానే సంభవించిందని తెలిపింది. జూన్‌లో రూ.33 కిలో ఉన్న టమాట ధర.. జులైలో 233 శాతం ఎగిసి ఏకంగా రూ.110కి చేరింది. క్రిసిల్ సోమవారం విడుదల చేసిన 'ఫుడ్ ప్లేస్' రిపోర్ట్ ప్రకారం.. ప్లేట్ భోజనం వరుసగా మూడు సార్లు పెరిగింది. ఏడాదికేడాదితో పోల్చితే 2023-24లో ఇది చాలా ఎక్కువ. మాంసాహారం థాలీ (ప్లేట్) ధర కూడా పెరిగింది.. కానీ నెలవారీగా 13 శాతం తక్కువగా ఉంది. నెలవారీ మార్పు సాధారణ వ్యక్తి వ్యయంపై ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది. తృణధాన్యాలు, పప్పులు, బ్రాయిలర్‌లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, వంట నూనె, వంట గ్యాస్‌తో సహా పరిగణలోకి తీసుకుని థాలీ ధరను లెక్కిస్తుంది.

'పోలవరం' జాతీయ సమస్య

- పరిహారం, పునరావాసం కేంద్రానిదే బాధ్యత
- అది పూర్తి కాకపోతే.. ప్రాజెక్టు కొనసాగదు
- ప్రధాని మోడీకి, సిఎం జగన్ ఆత్మ సమర్పణ
- నిర్వాసితుల ధర్నాలో సీతారాం ఏచూరి


ధర్నాలో అభివాదం చేస్తున్న సీతారాం ఏచూరి, వి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు


హాజరైన నిర్వాసితులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం నిర్వాసితుల సమస్య, జాతీయ సమస్యగా మారిందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. పరిహారం, పునరావాసం బాధ్యత కేంద్రానిదేనని, అది పూర్తి కాకపోతే.. ప్రాజెక్టు కొనసాగదని హెచ్చరించారు. సోమవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద సిపిఎం ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై ధర్నా జరిగింది. ఈ ధర్నాను ఏచూరి ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఢిల్లీలో ధర్నా చేస్తున్నారని, తద్వారా దేశం ముందుకు ఈ సమస్యను తీసుకొచ్చారని అన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెరుగుతుందని, దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని అన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని, దీనిపై నిర్ణయాలు తీసుకునే బాధ్యత కేంద్రంపై ఉంటుందని తెలిపారు. పునరావాసానికి అవసరమైన వనరులను సమకూర్చడం కేంద్రం బాధ్యత అని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించుకోవాలని, అంతేతప్ప పోలవరం నిర్వాసితులను ఇబ్బంది పెట్టకూడదని అన్నారు. రెండు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోడికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆత్మ సమర్పణ చేసుకుందని విమర్శించారు. 2014 రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్లో పోలవరం గురించి లేవనెత్తానని, కాంగ్రెస్ జాతీయ ప్రాజెక్టుగా విభజన చట్టంలో పొందిపరించిందని అన్నారు. అప్పుడు బిజెపి కూడా పోలవరం పునరావాసం, పరిహారంపై ఒప్పుకుందని, కానీ ఇప్పుడు నిధులు ఇవ్వటం లేదని విమర్శించారు.

2013 చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం

రెండు జిల్లాల్లో ఎనిమిది మండలాల్లోని 392 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, ఇవన్నీ గిరిజన గ్రామాలేనని అన్నారు. ఈ గ్రామాలకు రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ కింద ప్రత్యేక హక్కులున్నాయని అన్నారు. 1,06,006 పోలవరం ప్రాజెక్టు బాధిత కుటుంబాలున్నట్లు అంచనా వేశారని, వీరందరికీ 2013 భూసేకరణ చట్టం కింద పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్‌లోని గ్రామాల హక్కులను, గిరిజన హక్కులను పరిరక్షించాలంటే, పునరావాసం కల్పించే ప్రాంతాలను ఐదో షెడ్యూల్‌లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అయితే పునరావాసం గురించి కేటాయించిన మొత్తంలో కేవలం నాలుగో వంతు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. ప్రతి ఎకరాకూ రూ.20 లక్షలు పరిహారం ఇవ్వాలని, పునరావాస కాలనీల్లో అన్ని సౌకర్యాలు ఉండాలని డిమాండ్ చేశారు.

పునరావాసం, పరిహారం పూర్తికాకపోతే, పోలవరం ప్రాజెక్టు కొనసాగదని హెచ్చరించారు. పునరావాసం, పరిహారమే ప్రాధాన్యతగా ఉండాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు, పార్లమెంటు చేసిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందుకోసం రాబోయే రోజుల్లో పోరాటం ఉధృతం కానుందని అన్నారు. ఎన్నికలు రాబోతున్నాయని, ఎన్నికల కోసమైనా మోడీ ప్రభుత్వం ప్రజా పోరాటాల ఒత్తిడికి లొంగే అవకాశం ఉందని తెలిపారు. ఎల్లప్పుడూ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అండగా ఎర్ర జెండా ఉంటుందని, ఎర్ర జెండా అండతో పునరావాసం పూర్తయ్యేవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

గిరిజన హక్కులపై మోడీ సర్కార్ బుల్డోజర్ : బృందా కరత్

గిరిజన హక్కులపై మోడీ సర్కార్ బుల్డోజర్ చేస్తుందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్ ఆగ్రహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతుతో పెట్టుబడిదారులు అభివృద్ధి పేరుతో ఆదివాసీ గుండెలపైన ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని విమర్శించారు. జాతీయ ప్రాజెక్టు అంటున్నారని, ఆదివాసులు జాతీయులు కాదా? అని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్‌లో, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం ఆదివాసుల హక్కులు అని స్పష్టం చేశారని తెలిపారు. మణిపూర్‌లోని గిరిజనుల భూములను కార్పొరేట్లకు ఇస్తున్నారని, ఝార్ఖండ్‌లో గిరిజనుల భూములను లాక్కొంటున్నారని, బెంగాల్‌లో కోల్ ప్రాజెక్టు పేరుతో వేలాది ఎకరాల ఆదివాసీ భూములను తీసుకున్నారని విమర్శించారు. ఆదివాసీ భూములు, హక్కులు, గుర్తింపు సవాల్‌గా మారాయని పేర్కొన్నారు. పార్లమెంటులో అటవీ సంరక్షణ సవరణ చట్టం చేశారని, ఇది ఆదివాసులకు ఉండే హక్కులను హరిస్తుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీ పక్షంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఇడి, సిబిఐకి భయపడి ఎపిలో జగన్మోహన్‌రెడ్డి.. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావటం లేదని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పక్షాన మాట్లాడటం లేదని విమర్శించారు.

పోలవరం జాతీయ ప్రాజెక్టు... పునరావాసం జాతీయ సమస్య : వి శ్రీనివాసరావు

పోలవరం జాతీయ ప్రాజెక్టు కనుక, పునరావాసం జాతీయ సమస్యగా మారిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. నర్మదా పునరావాసం, తెహ్రీ డ్యాం వలే పోలవరం పునరావాసం జాతీయ సమస్య అయిందని పేర్కొన్నారు. నిర్వాసితుల సమస్యలు పట్టించుకోకపోతే ప్రాజెక్టు నిర్మాణం జరగదని స్పష్టం చేశారు. పోలవరం నిర్వాసితులు వచ్చి ఢిల్లీలో ఆందోళన చేస్తుంటే, వైసిపి, టిడిపి ఎంపిలకు పట్టదా? అని ప్రశ్నించారు. పోలవరం నిర్మాణం విషయంలో వైసిపి, టిడిపి ఒకరిపై ఒకరు నిందలు వేసుకుని తప్పుదోవ పట్టిస్తున్నారని, కానీ ఈ రెండు పార్టీలు నిర్వాసితుల పరిహారం, పునరావాసంపై మాత్రం మాట్లాడటం లేదని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.55 వేల కోట్లు అంచనా వేస్తే, అందులో దాదాపు రూ.35 వేల కోట్లు పరిహారం, పునరావాసమేనని అన్నారు. అయితే ఇందులో కేవలం రూ.ఏడు వేల కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.

జీవన్మరణ పోరాటం : అశోక్ ధావలే, విజూ కృష్ణన్

పోలవరం నిర్వాసితులు జీవన్మరణ పోరాటం చేస్తున్నారని ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్ అన్నారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ బిజెపికి సేవ చేస్తున్నారని, పోలవరం నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేశారని అన్నారు. ఎన్నికల్లో ఓట్లు కోసం వచ్చే వైసిపి, టిడిపి, బిజెపిలకు సరైన సమాధానం ఇవ్వాలని పిలుపునిచ్చారు. పోలవరం పోరాటానికే కాదని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం వంటి వాటికి కూడా ఎఐకెఎస్ మద్దతుగా నిలిచిందని అన్నారు.

టిడిపికి పట్టిన గతే, వైసిపికి పడుతుంది : బి వెంకట్

ఎపిలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు గిరిజనులు, పేదల పక్షాన లేకుండా బిజెపి పంచన చేరాయని ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పేర్కొన్నారు. గతంలో టిడిపికి పట్టిన గతే, వైసిపికి పడుతుందని అన్నారు.

శాసనమండలిలో లేవనెత్తుతాం : కెఎస్ లక్ష్మణరావు

పోలవరం నిర్వాసితుల సమస్యలపైన వచ్చే శాసనమండలి సమావేశాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీలంతా లేవనెత్తుతామని శాసనమండలి పిడిఎఫ్ పక్షనేత కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులను నాడు చంద్రబాబు మోసం చేశారని, ఇప్పుడు జగన్ మరోసారి మోసం చేస్తున్నారని విమర్శించారు. నిర్వాసితుల కాలనీల్లో సౌకర్యాలు లేవని, స్కూల్స్, అంగన్‌వాడీ సెంటర్లు లేవని తెలిపారు. ఉపాధి హామీ పనులు కూడా వారికి ఇవ్వటం లేదని పేర్కొన్నారు.

గిరిజనులు జాతిలో భాగం కాదా? : జితిన్ చౌదరి

ప్రధాని మోడీ ఎప్పుడూ జాతి అంటారని, గిరిజనులు జాతిలో భాగం కాదా? అని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్ఎం) జాతీయ కన్వీనర్, మాజీ ఎంపి జితిన్ చౌదరి ప్రశ్నించారు. గిరిజన హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తుందని, గిరిజనులను భూముల నుంచి తరిమేసి, ప్రాజెక్టులు కడుతున్నారని విమర్శించారు. పోలవరం నిర్వాసితుల పోరాటానికి తమ సంఘం మద్దతు ఉంటుందని అన్నారు.

పార్లమెంటులో లేవనెత్తుతాం : వి శివదాసన్

పోలవరం నిర్వాసితుల సమస్యలపై పార్లమెంటులో లేవనెత్తుతామని సిపిఎం రాజ్యసభ ఎంపి వి శివదాసన్ హామీ ఇచ్చారు. ఎపి ప్రభుత్వానికి ప్రజల సమస్యలు పట్టవని, వారు బిజెపికి మద్దతుగా ఉన్నారని అన్నారు. కార్పొరేట్లకు సాగిలపడటమే ధ్యేయంగా పని చేసే బిజెపిలానే, వైసిపి కూడా కార్పొరేట్ల కోసమే పని చేస్తుందని విమర్శించారు.

ఎజెండాగా పార్లమెంటులో నిర్వాసితుల సమస్య : మొడియం నాగమణి

పార్లమెంటు సమావేశాల్లో పోలవరం నిర్వాసితుల సమస్యలను ఎజెండాగా తీసుకోవాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగమణి కోరారు. పాలకుల బుద్ధి మారకపోవడంతోనే ఢిల్లీ వచ్చామని, ప్రధాని మోడీకి హెచ్చరించడానికి వచ్చామని స్పష్టం చేశారు. జులైలో వచ్చిన వరదల్లో ఎటువంటి సాయం అందలేదని అన్నారు. ఆదివాసులను దోచుకుంటున్న పాలకులను గద్దెదించాల్సిందేనని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్ కుమార్, ఆర్ లక్ష్మయ్య (సిఐటియు), విపి సాను (ఎస్ఎఫ్ఐ), అయోధ్య రామ్ (వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగ నేత), సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపి మిడియం బాబూరావు, తెలంగాణ నేత బండారు రవి కుమార్, పశ్చిమ బెంగాల్ మాజీ ఎంపి పులెన్ బసు, ఝార్ఖండ్ నేత సుభాష్ ముర్ము, సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి కిరణ్, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ రవి, రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాణి శ్రీ, విఆర్ పురం ఎంపిపి కారం లక్ష్మి, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులందరికీ న్యాయం


- ఢిల్లీలో గళం విప్పిన పోలవరం బాధితులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పోలవరం ప్రాజెక్టు బాధితులు ఢిల్లీ వీధుల్లో గళం విప్పారు. జంతర్‌మంతర్‌లో జరిగిన ధర్నాకు ముందు నిర్వాసితులు ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయంగా తమను గోదావరిలో ముంచివేస్తున్న తీరును దేశరాజధాని నగరంలో వినిపించి, తమ హక్కులను కాపాడాలని కోరేందుకు ఆంధ్రప్రదేశ్ నుండి బయలుదేరి ఆదివారానికే ఢిల్లీ చేరుకున్న వందలాది మంది గిరిజనులు సోమవారం ఉదయం హరికిషన్ సింగ్ సూర్జిత్ (హెచ్‌కెఎస్) భవన్ నుండి ప్రదర్శనగా బయలుదేరారు. సిపిఎంతో పాటు, వివిధ ప్రజాసంఘాల నేతలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కన్నాట్ ప్లేస్ మీదుగా జంతర్‌మంతర్ వరకు సాగిన ఈ ప్రదర్శనలో పాల్గొన్న గిరిజనులు సాంప్రదాయబద్ధంగా అడుగులు వేస్తూ, నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ ముందుకు కదిలారు. ప్రజానాట్యమండలి కళాకారులు సైతం వీరితో కదం కలిపారు. 'పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం చెల్లించాలి' '1986, 2022 వరదల్లో మునిగిన గ్రామాలన్నిటినీ మొదటి దశ పునరావాసంలో కలపాలి.' 'గోదావరి వరదల నుండి రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయ చర్యలు చేపట్టాలి' 'కేంద్రం జాతీయ విపత్తు నిధులు ఇవ్వాలి.' తప్పుల తడకగా ఉన్న కాంటూరు లెక్కలను మార్చాలి.' 'రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 కింద ఉన్న గిరిజనుల ప్రత్యేక హక్కులను కాపాడాలి' వంటి నినాదాలు ఈ ప్రదర్శనలో మారుమ్రోగాయి. ఈ మేరకు ప్లకార్డులు ప్రదర్శించారు. పదేపదే విజ్ఞప్తులు చేసినా స్పందించని మోడీ ప్రభుత్వ తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. ఈ ప్రదర్శనలో మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా పెట్టుబడిదారులు, కార్పొరేట్లు, మతోన్మాదుల నుంచి స్వేచ్ఛ కోరుతూ చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తదితర నాయకులు అభివాదం చేశారు. అనంతరం నేతలు విల్లు ఎక్కుపెట్టి ధర్నాను ప్రారంభించారు.

సిఎం తోలుబొమ్మగా మారతారు

- ఢిల్లీ బిల్లు నియంతృత్వానికి ప్రతిబింబం
- సిపిఎం రాజ్యసభ ఎంపి బికాష్ రంజన్ భట్టాచార్య



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ బిల్లు ఆమోదంతో ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి తోలుబొమ్మగా మారతారని సిపిఎం రాజ్యసభ నేత బికాష్ రంజన్ భట్టాచార్య అన్నారు. ఢిల్లీ బిల్లుపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో సిపిఎం తరపున బికాష్ రంజన్ భట్టాచార్య మాట్లాడారు. ఈ బిల్లుతో నాగరికత వెనక్కి వెళ్తున్నట్లుందని అన్నారు. రాజ్యాంగ అసెంబ్లీలో పరిపాలన పాత్రపై చర్చించినట్లు అందరికీ తెలుసని, గవర్నరు మరొక అధికార కేంద్రం కాకూడదని నిర్ణయించారని తెలిపారు. ఎన్నికైన ప్రభుత్వం, ప్రజా ప్రతినిధుల సలహాలను గవర్నరు అమలు చేయాలనేది ప్రాథమిక సూత్రమని అన్నారు. రాజ్యాంగంలో సమాఖ్య వ్యవస్థ ఉందని తెలిపారు. రాజ్యాంగంలో ఢిల్లీ రాష్ట్రం కాదని, అది కేంద్ర పాలిత ప్రాంతమని అన్నారు. అయినప్పటికీ హేతుబద్ధంగా ఢిల్లీ రాష్ట్రమని, దానికి కొన్ని అధికారాలు ఉన్నాయని తెలిపారు. పరిపాలించే హక్కు ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ఉందని, 239ఎ రాజ్యాంగ సవరణ ఈ విషయాన్నే స్పష్టం చేస్తుందని అన్నారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు జవాబుదారీతనంగా గవర్నరు, బ్యూరోక్రసీ ఉండాలని, ఇదే రాజ్యాంగ నైతికత అని తెలిపారు. ఇది ప్రజాస్వామ్య గణతంత్రమని అన్నారు. అదే స్వాతంత్ర్య పోరాట ఫలితమని పేర్కొన్నారు. కొంత మంది స్వాతంత్ర్య పోరాట వారసత్వం లేనివాళ్లు భిన్నంగా ఆలోచిస్తారని తనకు తెలుసన్నారు. స్వాతంత్ర్య పోరాటం, ప్రాణ త్యాగాల ఫలితమే ప్రజా ప్రభుత్వమని అన్నారు. కొంత మంది బ్రిటిష్ వారికి లొంగిపోయిన వాళ్ల గురించి కాదని ఎద్దేవా చేశారు. పార్లమెంటు అధికారం గురించి ఎవరూ ప్రశ్నించటం లేదని, అయితే అధికారం వివేకంతో కూడుకుని ఉండాలని అన్నారు. వివేకంతో లేని అధికారం రాజ్యాంగానికి విరుద్ధంగా, నిరంకుశంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రజలకే అంతిమ నిర్ణయం ఉంటుందని అన్నారు. ఈ బిల్లు నియంతృత్వాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. తనకు నచ్చిన బ్యూరోక్రట్‌ని నియమిస్తే, ఆయన ప్రజా ప్రభుత్వాన్ని నియంత్రిస్తాడని పేర్కొన్నారు. ఈ బిల్లులో పూర్తిగా ఆధునిక మానవీయత కొరవడిందని అన్నారు. ప్రజాస్వామ్యమంటే అధికార వికేంద్రీకరణే తప్ప, అధికార కేంద్రీకరణ కాదని అన్నారు. ఈ బిల్లు వల్ల ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి తొలుబొమ్మగా మిగిలిపోతారని, ముఖ్యమంత్రిని బ్యూరోక్రట్ నియంత్రిస్తాడని అన్నారు. చిల్లర రాజకీయాలు మాని అందరూ ఈ కీలకమైన పరిస్థితి అర్థం చేసుకోవాలని రాజకీయ పార్టీ నేతలకు సూచించారు. రేపు ఒడిశా గవర్నరుకు సబ్ సర్వెంట్‌గా ఒడిశా సిఎం, ప్రభుత్వం ఉండాలని బిల్లు ఆమోదిస్తారా? అప్పుడు ఏం చేస్తారని ప్రశ్నించారు.

లోక్‌సభలో వ్యక్తిగత డేటా బిల్లు ఆమోదం

లోక్‌సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ఐదు బిల్లులు ఆమోదం పొందాయి. సోమవారం లోక్‌సభ ప్రారంభం కాగానే మణిపూర్‌పై ప్రతిపక్ష పార్టీల సభ్యులు ప్లకార్డులు చేబూని ఆందోళన చేపట్టారు. నినాదాలు హోరెత్తించారు. అలాగే అధికార పక్షనేతలు కూడా నినాదాలు చేశారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. అధికార, ప్రతిపక్షాల నినాదాల మధ్యే స్పీకరు ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. అయితే గందరగోళం కొనసాగడంతో రెండు నిమిషాల్లోనే సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. మరోవైపు స్పీకరు ఛైర్‌లో ఉన్న ప్యానెల్ స్పీకరు కీర్తి ప్రేమ్‌జీ సోలంకి బిజెపి ఎంపి నిషికాంత్ దుబేకు అవకాశం ఇచ్చారు. ఆయన న్యూస్ క్లిక్ సంస్థ, కాంగ్రెస్, చైనా వంటి నిరూపితం కాని, ఆధారాలు లేని న్యూయార్క్ టైమ్స్ రాసిన కథనం గురించి లేవనెత్తారు. వెంటనే అధికార పక్ష ఎంపిలు లేచి నినాదాలు, అరుపులతో తీవ్ర గందరగోళాన్ని సృష్టించారు. వెంటనే మూడు నిమిషాల్లోనే సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. వరుసగా ఐదు బిల్లులను ఆమోదించుకున్నారు. ఇందులో కీలకమైన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లుతోపాటు తీర ఆక్వాకల్చర్ అథారిటీ (సవరణ) బిల్లు, అనుసంధన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లు, ఫార్మసీ (సవరణ) బిల్లు, మధ్యవర్తిత్వ బిల్లులను మూజువాణి ఓటుతో ఆమోదించారు. మరోవైపు రాజ్యసభలో మణిపూర్ కాలిపోతుందని ప్రతిపక్షాలు లేవనెత్తాయి. అలాగే మణిపూర్‌పై చర్చ జరగాలని ప్రతిపక్షాలు నినదించాయి. దీంతో ప్రారంభం అయిన 14 నిమిషాల్లోనే సభను మధ్యాహ్నం 2 గంటలకు ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ఢిల్లీ పౌరసేవల సవరణ బిల్లుపై చర్చ జరిగింది. బిల్లు ఆమోదం పొందింది.

కేంద్రం నిధులిస్తేనే...

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును మూడు దశల్లో నిర్మించేందుకు కేంద్రం అనుమతిచ్చిందన్నారు. మొదటి దశ 41.15 మీటర్ల వరకూ నిర్మించనున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఖర్చుకు సంబంధించిన నిధులపై కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామని, ఈ నెలాఖరుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలుపుతుందని ఆశిస్తున్నామని తెలిపారు. కేంద్రం కేబినెట్ ఆమోదిస్తే వెంటనే రూ.17 వేల కోట్లు నిధులు వస్తాయని, ఆ నిధుల్లో రూ.5 వేల కోట్లకుపైగా నిర్వాసితులకు పరిహారంగా ఇచ్చి, మిగిలిన డబ్బులతో ప్రాజెక్టు పనులు చేపడతామన్నారు. వచ్చే జనవరి నాటికి 41.15 కాంటూరు పరిధిలో నిర్వాసితులకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. పునరావాస ప్యాకేజీ రూ.10 లక్షలు, 2006కు ముందు సేకరించిన భూములకు సంబంధించి దాదాపు 49 వేల మందికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇస్తానని గతంతో తాను హామీ ఇచ్చానని, ఆ సొమ్మును కూడా జనవరి, ఫిబ్రవరి నెలల్లో నిర్వాసితులకు జమ చేస్తామని తెలిపారు.

ఆర్ అండ్ ఆర్ ఇవ్వలేదని మీరంటున్నారని, అది తన చేతుల్లో లేదని అన్నారు. 2025 ఖరీఫ్ నాటికి పోలవరం మొదటి దశ 41.15 మీటర్లకు పూర్తి చేస్తామని తెలిపారు. ఆ పరిధిలోని వారందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పునరావాసం అమలు చేస్తామని అన్నారు. ఆ తర్వాత రెండు, మూడు దశల పనులు పూర్తవుతాయని, ఆ ప్రకారమే పరిహారం అందుతుందని తెలిపారు. 45.72 కాంటూరులో ఉన్న పలు గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయని పలువురు సిఎం జగన్ దృష్టికి తీసుకురాగా, లైడార్ సర్వేనే ఫైనల్ అని ఆయన తేల్చి చెప్పారు. ఇప్పుడు కదిపితే మళ్లీ కాలయాపన జరుగుతుందని, తర్వాత చూద్దామంటూ మాట దాటవేశారు. లైడార్ సర్వే ద్వారా 32 గ్రామాల్లో 48 హ్యాబిటేషన్లను గుర్తించామని, వాటినీ మొదటి ఫేజ్‌లోకి తెచ్చి పరిహారం, పునరావాసం కల్పిస్తామని అన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో గొమ్ముగూడెం గ్రామంలోని 245 కుటుంబాలకు 6.37 లక్షలు చొప్పున పునరావాస ప్యాకేజీని సోమవారం ఉదయం జమ చేశారు. కాగా, నిర్వాసితుల సమావేశం అనంతరం ముఖ్యమంత్రి రాజమహేంద్రవరం చేరుకొని వైసిపి ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు.

అడుగడుగునా ఆంక్షలు, మీడియాకు హెలిప్యాడ్ వరకే అనుమతి

సిఎం పర్యటన నేపథ్యంలో అడుగడుగునా ఆంక్షలు కొనసాగాయి. అధికారులు స్లిప్‌లు జారీ చేసిన వారిని మాత్రమే ముఖాముఖికి అనుమతించారు. వివిధ గ్రామాల నుంచి ఎవరినీ రాకుండా ముందుగానే హెచ్చరికలు జారీ చేసినట్లు స్థానికులు తెలిపారు. తమ అనుయాయులనే బాధితుల జాబితాలో చేర్చి మాట్లాడించినట్లు తెలుస్తోంది.. మీడియాను హెలీప్యాడ్ వద్దనే నిలిపివేశారు.

నిర్వాసితుల నిరాశ

సిఎం జగన్ పర్యటనపై పోలవరం నిర్వాసితులు నిరాశ చెందారు. పరిహారం, ప్యాకేజీ సహా పలు అంశాలపై ఆయన ప్రసంగంలో స్పష్టత కొరవడిందని పలువురు తెలిపారు. అధికార పార్టీకి సానుభూతిపరులుగా ఉన్న వారితోనూ, గృహ సారథులు, కొంతమంది సర్పంచ్‌లతోనే సభ జరిపారని, పోలవరం నిర్వాసితుల కష్టాలు, వరద బాధితుల ఆవేదన ప్రస్ఫుటం కాలేదని అన్నారు. సమస్యలపై అవగాహన ఉన్నవారిని సభకు అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం సభ నేపథ్యంలో కూనవరంలో సిపిఎం, టిడిపి, బిజెపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

రాజ్యసభలో ఢిల్లీ బిల్లు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొచ్చిందని ఆప్ ఎంపి రాఘవ్ చద్దా ధ్వజమెత్తారు. 25 ఏళ్లుగా బిజెపి గెలుపునకు దూరమైందని, కేజ్రీవాల్ ప్రభుత్వం కారణంగా మరో 25 ఏళ్లు గెలువలేమనే విషయం బిజెపికి బాగా తెలుసునని అన్నారు. ఆ కారణంగానే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని ధ్వంసం చేయాలని బిజెపి కోరుకుంటోందన్నారు. తమ హక్కు గురించే తప్ప మరొకటి ఏమీ తాము కోరుకోవడం లేదన్నారు. ఢిల్లీ సర్వీసుల బిల్లు ఒక 'పొలిటికల్ ఫ్రాడ్' అని, రాజ్యాంగ పాపమని, ఢిల్లీలో ప్రభుత్వ యంత్రాగాన్ని స్తంభింప చేయడానికి ఉద్దేశించిన బిల్లు అని విమర్శలు గుప్పించారు. సమిష్టి బాధ్యతను గుర్తుచేసే పార్లమెంటరీ సిద్ధాంతాలను బలహీనపరచడమే ఈ బిల్లు ఉద్దేశమని అన్నారు. రాజ్యాంగ నేరానికి కేంద్రం పాల్పడుతోందని విమర్శించారు. ఇప్పుడు ఆఫీసర్లు ఎవరూ ముఖ్యమంత్రి, మంత్రులు మాట వినే పరిస్థితి ఉండదన్నారు.

ఈ బిల్లుపై బికాష్ రంజన్ భట్టాచార్య (సిపిఎం), పి సంతోష్ కుమార్ (సిపిఐ), కె కేశవరావు (బిఆర్ఎస్), వి విజయసాయి రెడ్డి (వైసిపి), పి చిదంబరం (కాంగ్రెస్), తిరుచ్చి శివ (డిఎంకె), మనోజ్ కుమార్ ఝా, ఎడి సింగ్ (ఆర్‌జెడి), డెరిక్ ఓబ్రెయిన్, సుఖేందు శేఖర్ రాయ్ (టిఎంసి), ఫౌజియా ఖాన్ (ఎన్‌సిపి), జవేద్ అలీ ఖాన్ (ఎస్‌పి), సంజయ్ రౌతు (శివసేన), అనీల్ ప్రసాద్ హెగ్డే (జెడియు), జోషి కె మణి (కెసిఎం), వైకో (ఎండిఎంకె), మహువా మాంఝీ (జెఎంఎం), సస్మిత్ పాత్ర (బిజెడి), ఎం తంబిదొరై (అన్నాడిఎంకె), జికె వసన్ (టిఎంసిఎం), సుధాన్షు త్రివేది, రాధా మోహన్ దాస్ అగర్వాల్, మహేష్ జఠ్మలానీ, ఘనశ్యామ్ తివారీ, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి, భూవనేశ్వర్ కలిట, అనిల్ జైన్, సురేంద్ర సింగ్ నగర్, కవితా పటిదర్ (బిజెపి), కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథ్వాలే (ఆర్‌పిఐ), నామినేటెడ్ ఎంపిలు రంజన్ గొగోయ్, అజిత్ కుమార్ భుయన్ మాట్లాడారు.

దేశ ప్రజలు తమకు అధికారం, హక్కు ఇచ్చారు : అమిత్ షా

అనంతరం బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానమిస్తూ, సుప్రీంకోర్టు ఉత్తర్వులను బిల్లు ఉల్లంఘించలేదని అన్నారు. ఢిల్లీలో ఎలాంటి అవినీతికి తావులేని పాలన అందివ్వడం, అవినీతిపై పోరాటమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఢిల్లీలో పోస్టింగుల బదిలీల విషయంలో గతంలో ఎలాంటి గొడవలు లేవని, ముఖ్యమంత్రులతో ఎలాంటి సమస్యలు ఉండేవి కావని అన్నారు. 2015లో ఒక ఆందోళన తరువాత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, కేంద్రం తమ హక్కులను లాక్కోవాలని చూస్తోందంటూ కొందరు మాట్లాడారని అన్నారు. ఆ విధంగా చేయాల్సిన పని కేంద్రానికి లేదని, దేశ ప్రజలు తమకు అధికారం, హక్కు ఇచ్చారని చెప్పారు. ఈ బిల్లు స్పష్టమైన చెల్లుబాటని పేర్కొంటూ సుప్రీంకోర్టు మాజీ సిజెఐ, ఎంపి రంజన్ గొగోయ్ ప్రసంగం సమయంలో సమాజ్ వాదీ పార్టీ నుండి జయా బచ్చన్, శివసేన (యుబిటి) నుండి ప్రియాంక చతుర్వేది, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నుండి వందనా చవాన్, టిఎంసి నుండి సుస్మితా దేవ్ రాజ్యసభ నుండి వాకౌట్ చేశారు. ఇప్పటికే ఈ బిల్లు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది.

మొరాయించిన రాజ్యసభ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు

బిల్లుపై ఓటింగ్‌కు ప్రతిపక్షాలు డిమాండ్ చేయగా, డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ అనుమతించారు. అయితే ఎలక్ట్రానిక్ ఓటింగ్ ప్రక్రియ జరపాలని రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు సూచించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు మొరాయించడంతో చిట్టీలతో ఓటింగ్ నిర్వహించారు.

రాజ్యాంగానికి లోబడే ఢిల్లీ బిల్లు : విజయసాయి రెడ్డి

ఢిల్లీ సర్వీసుల బిల్లు రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు లోబడే ఉందని వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీ సర్వీసుల బిల్లుపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు లోబడి ఉన్నందునే ఈ బిల్లుకు మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు.

ఢిల్లీలో మంటలు రాజేస్తున్న డర్టీ పాలిటిక్స్ చేస్తున్నదెవరో తమకు తెలుసునని, ఆప్ సభ్యుడికి నేనిచ్చే సలహా ఒక్కటే నిప్పుతో చెలగాటం ఆడితే అది నిన్ను దహిస్తుందని అన్నారు. ఈ బిల్లు పాసైతే ఆమ్ ఆద్మీ పార్టీ కాస్త అబ్సల్యూట్ అనార్కీ పార్టీ (ఆప్) అవుతుందని, తానాషాహీ పార్టీ తమ స్వార్థ ప్రయోజనాలకు ఢిల్లీని వాడుకోజాలదని అన్నారు. నీతిలేని పాలన నుంచి ఢిల్లీని రక్షించడానికే తాము ఈ బిల్లుకు మద్దతు తెలుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంలో ఇడి.. ఇడి.. అంటూ ప్రతిపక్షాలు నినాదాలు చేశాయి. వెంటనే స్పందించిన విజయసాయి రెడ్డి 'ఇడి మీ వద్దకు కూడా వస్తుంది' అని పేర్కొన్నారు.





మీకోసం

బాగా నిల్వ ఉన్న శనగపిండిని పారేయకుండా స్టీలు గిన్నెలు, వెండి సామాన్లు తోమడానికి ఉపయోగిస్తే తళతళ మెరుస్తాయి.

జీవన సౌరభం

చేయాల్సిన పనిని చేయకపోవడం, చేయకూడని పనిని చేయాలనుకోవడం.. రెండూ తప్పే.

JEEVANA జీవన the family

చదువుతోనే గౌరవం




ఒక ఊరిలో రాము అనే పిల్లవాడు ఉన్నాడు. అతను తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. రాము చాలా పొట్టిగా ఉండటం వల్ల స్కూల్లో కొందరు పిల్లలు ఎగతాళి చేసేవారు. ఈ అవమానాల మధ్య రాము ప్రతి రోజూ స్కూలుకు వెళుతున్నా చదువు అబ్బలేదు. దీంతో పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయి.

ఒకసారి రాము వాళ్ళ తరగతి ఉపాధ్యాయుడు 'నీకు మార్కులు ఎందుకు తక్కువ వస్తున్నాయి? ఎందుకు సరిగా చదవడం లేద'ని అడిగారు. అప్పుడు రాము 'తనను అందరూ 'పొట్టోడు', 'పొట్టోడు' అంటూ ఎగతాళి చేస్తున్నార'ని చెప్పాడు. ఒక వ్యక్తి ఎత్తుకు అతని ప్రతిభకు ఎలాంటి సంబంధం లేదని, ప్రపంచంలో ఎంతోమంది తమ శక్తిసామర్థ్యాల వల్లే గొప్పవారిగా మారారని, శారీరక, మానసిక సమస్యలు వ్యక్తి ప్రతిభకు కొలమానం కాద'ని మాస్టారు అన్నారు. 'చదువుతోనే మనిషికి గౌరవం పెరుగుతుంద'ని చెప్పారు.

ఆ మాటలతో రాములో ఆత్మవిశ్వాసం పెరిగింది. అప్పటి నుంచి ఎగతాళి మాటలు పట్టించుకోకుండా బాగా చదివాడు. పదవ తరగతిలో జిల్లా మొదటి స్థానంలో నిలిచాడు. అప్పటివరకు 'పొట్టోడు' అని పిలిచిన వాళ్లు, ఊరి వారు రామును ఎంతో మెచ్చుకున్నారు. తమ తప్పు క్షమించమని ఆ ఎగతాళి చేసిన విద్యార్థులు రాముని అడిగారు.

- ఎం. చరణ్,
9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నర్సింహులు పల్లి.



సమాధానాలు రాయండి

పిల్లలూ, బొమ్మ నెంబరుకు సరిపోయే గడిలో దాని సరైన పదం రాయండి.. తమాషాగా 10వ నంబరులో ఉన్న బొమ్మ పేరు కూడా వచ్చేస్తుంది.

నేను గీసిన బొమ్మ



డి.ముని తేజ
1వ తరగతి,
దిగువ సాంబయ్య పాళెం
ప్రాథమిక పాఠశాల,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పాములను పడుతూ .. అపోహలను వదిలిస్తూ ...



'పాము విషపూరితమైనది. మనుషులు కనిపిస్తే కాటేస్తుంది. కాబట్టి పాములను బతకనీయకూడదు. చంపేయాలి' అన్న మాటలు వింటూ పెరిగిన వేదప్రియ.. అవన్నీ అపోహలని, విషం.. పాములకు ఆత్మరక్షణగా ఉపయోగపడే సాధనమని నిరూపించేందుకు ప్రాణాలను సైతం పణంగా పెట్టి స్నేక్ కాచర్‌గా విధులు నిర్వహిస్తోంది. పురుషులు మాత్రమే ఉండే ఈ రంగంలో మహిళలు రాణించడం చాలా అరుదు. అయినా వేదప్రియ లాంటి వాళ్లు ఎప్పుడో ఒకప్పుడు తారసపడుతూనే ఉంటారు.

తమిళనాడుకు చెందిన వేదప్రియ గణేశన్, చిన్నతనం నుండే వన్యప్రాణుల రక్షణ కోసం పనిచేయడం మొదలుపెట్టింది. ముఖ్యంగా అత్యంత విషపూరిత పాములను రక్షించడంలో ఎప్పుడూ ముందుండేది. 'ఆ కోబ్రాని చంపకండి..' అంటూ బిగ్గరగా అరిచి, తన చుట్టూ కర్రలతో నుంచొన్న జనాలను తోసుకుంటూ ముందుకెళ్లింది వేదప్రియ. బళ్ల కింద కదలక మెదలక ఉన్న కోబ్రాను చేతితో తీసి దూరంగా పడేసింది. ఆ క్షణంలో చుట్టూ ఉన్నవాళ్లు ఆమె ధైర్యాన్ని ఎంతో మెచ్చుకున్నారు. అప్పుడు ఆమె 11వ తరగతి చదువుతోంది. ఆ వయసు నుండే వన్యప్రాణులపై ఆమెకు వల్లమాలిన అభిమానం మొదలైంది.

వేల సంఖ్యలో ...

ఆ సంఘటన జరిగిన 8 ఏళ్ల తరువాత 'వెస్ట్రన్ ఘాట్స్ వైల్డ్ లైఫ్ కన్సర్వేషన్' ట్రస్టు తరఫున చీఫ్ కోఆర్డినేటర్‌గా, వన్యప్రాణి సంరక్షకురాలిగా ఆమె ఎన్నో మైలురాళ్లు అధిగమించింది. చెన్నయ్, కోయంబత్తూర్, పొల్లాచి, మదురై వంటి తమిళనాడు అటవీ పరివాహక ప్రాంతాల్లో 8000 పైచిలుకు పాములను, మరెన్నో వన్యప్రాణులను రక్షించింది. తమిళనాడు ఫారెస్ట్ డిపార్టుమెంటు, తమిళనాడు ఫైర్ అండ్ సేఫ్టీ రెస్క్యూ డిపార్టమెంట్ ప్రోత్సాహంతోనే ఈ అద్భుతాలు సాధించానని ఆమె చెబుతోంది.

పురుషులు మాత్రమే ఉండే ఈ రంగంలో వేదప్రియ ప్రొఫెషనల్ స్నేక్ క్యాచర్‌గా మారడం సాధారణ విషయం కాదు. 'ఈ రంగంలో ఎదిగేందుకు ముందుగా నన్ను నేను శక్తివంతురాలిగా సిద్ధం చేసుకున్నాను. ఒక మహిళ తన కాళ్ల మీద తాను నిలబడగలిగే ధైర్యం ఉన్నప్పుడే, ఆమె అందరి మహిళల తరఫున నిలబడుతుంది' అని ఆమె చెబుతోంది. ఎవరైనా, ఎప్పుడైనా, ఏ సమయంలోనైనా పాము ఉందని ఫోను చేస్తే – వెంటనే అక్కడికి చేరుకుంటుంది వేదప్రియ. పామును పట్టుకొని సురక్షితంగా ఫారెస్టు డిపార్టుమెంటుకు అప్పగించడమో.. దగ్గరలోని అడవిలో వదిలివేయడమో చేస్తుంది. పాములతో పాటు, బ్లాక్ కైట్స్, కోతులు, దుప్పిలు, ఏనుగులు, లేళ్లు వంటి అనేక వన్యప్రాణులు ఆమె సంరక్షించిన వాటిలో ఉన్నాయి.

పాములను, వన్యప్రాణులను రక్షించడంతోనే ఆగిపోకుండా.. పాము కాటు– ప్రథమ చికిత్స, వన్యప్రాణుల రక్షణ, అగ్నిమాపక– భద్రతా, రెస్క్యూ వంటి అంశాల్లో ఆమె శిక్షణా తరగతులు నిర్వహిస్తోంది. ఆమె చేస్తున్న విశేషకృషిని గుర్తించిన పొల్లాచ్చికి చెందిన 'రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ ఎస్ఐఐఎంఎస్', ఇటీవల ఆమెను 2023–24కి గాను 'డాటర్ ఆఫ్ ఫారెస్ట్' అవార్డుతో సత్కరించింది.

చీమలకు చెక్ పెట్టండిలా ...

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మాత్రమే కాదు; అనేక రకాల సమస్యలు ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఈ కాలంలో చీమలు ఇంట్లో ఎక్కువగా కనిపిస్తూ చికాకు పెడతాయి. ఇంట్లో దొరికే వస్తువులతోనే వాటి బెడదను తప్పించుకోవచ్చు.

- ఒక వంతు డిష్ సోప్, రెండు వంతుల నీటితో ద్రావణం తయారుచేసి, సీసాలో పోయండి. ఇంటి మూలలో లేదా గోడపై చీమలు కనిపించిన చోట ఈ ద్రావణాన్ని పిచికారీ చేయండి.
- స్ప్రే బాటిల్‌లో సగం నీరు, సగం వైట్ వెనిగర్ ద్రావణాన్ని కలిపి కూడా పిచికారీ చేయవచ్చు.
- అలాగే స్ప్రే బాటిల్‌లో వెనిగర్, నిమ్మరసం కలిపిన నీటిని స్ప్రే చేసినా చీమలు పోతాయి.
- చీమలు ఎక్కువగా కనిపించిన చోట బోరిక్ యాసిడ్ చల్లితే చీమలు చనిపోతాయి.
- ఎండు మిరపకాయలు, దాల్చిన చెక్క , నిమ్మ తొక్కలను గది మూలలో ఒక గిన్నెలో ఉంచితే, చీమల బెడద తగ్గుతుంది.
- ఇంటిని తుడిచే నీటిలో కొన్ని చుక్కల నిమ్మరసాన్ని కలిపి శుభ్రపరిస్తే చీమలు తగ్గుతాయి.
- దాల్చిన చెక్క పొడిని చల్లినా చీమల బెడద తగ్గుతుంది.
- పుదీనా నూనెను పిచికారీ చేసినా ఫలితం ఉంటుంది.
- బేబీ పౌడర్‌ని చీమలపై చల్లినా చీమలు రావడం తగ్గుతుంది.
- కాఫీ గింజలు లేదా కాఫీ పొడిని చీమలు ఉన్న ప్రదేశంలో చల్లితే చీమలు రావు.
- చాక్‌పీస్‌లను మెత్తగా నూరి చీమలు వచ్చే ప్రదేశంలో చల్లినా వాటి బెడద తగ్గుతుంది.



సర్వరోగ నివారిణి 'ఉసిరి'

'శ్రీ ఫలం' అని పిలువబడే ఉసిరికాయలో ఎన్నో ఔషధ విలువలు ఉన్నాయి. విటమిన్ 'సి' పుష్కలంగా ఉన్న ఫలం. ఇది ఆయుర్వేద వైద్యంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. తల వెంట్రుకల మొదలు కాలి గోళ్ల వరకు ఉసిరి మానవ శరీరానికి అద్భుతంగా ఉపయోగపడే సర్వరోగ నివారిణి. ప్రతి రోజూ ఒక ఉసిరికాయను తింటే అన్ని రకాల పైత్యాలు తగ్గుతాయి. కఫం తగ్గుతుంది. మేథస్సు పెరుగుతుంది. మూల వ్యాధులు తగ్గిపోతాయి. శారీరక బలం పెరుగుతుంది. మధుమేహం వ్యాధి తగ్గుతుంది. డయాబెటిస్‌తో బాధపడేవారికి ఉసిరికాయ అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో అవసరమైన విటమిన్ "సి" అధికంగా ఉంటుంది. ఉసిరికాయ ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలను పెంచుతుంది. షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారు ఉదయాన్నే ఒక మంచి ఉసిరి కాయ తినడంతో నియంత్రణలో ఉంటుంది. ఉసిరికాయ, తేనె, కరక (త్రిఫల) చూర్ణాన్ని ఆవు నెయ్యితో కలిపి ప్రతి రోజూ తీసుకుంటే మధుమేహ వ్యాధి తగ్గుతుంది. విటమిన్ సి ఆరోగ్యానికి చాలా మంచిది. కంటి జబ్బులు రాకుండా నిరోధిస్తుందని పరిశోధనల్లో తేలింది. మహిళల్లో వచ్చే కాటరాక్ట్ నివారించడానికి దోహదం చేస్తుంది. అంతర్గతంగా ఉండే యాంటీ యాక్సిడెంటల్ పోషకాలు వయసు పెరుగుతుండటం వల్ల వచ్చే దృష్టి లోపాలు తగ్గిస్తాయి. రోజు 140 మి.గ్రా. విటమిన్ సి మనకు అవసరం. కృత్రిమంగా లభించే 100 మి.గ్రా., విటమిన్ సి, ఒక్క ఉసిరిలోనే లభిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. నిమ్మ–కమలాలకన్నా 10 నుంచి 20 రెట్లు అధికంగా ఉసిరిలోనే విటమిన్ సి ఉంది. ఉసిరిలోని గాలిక్, ఇలాగిక్, గ్లూకోజ్‌లు ఆరోగ్యాన్ని పెంపొందించటంతోపాటుగా రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఉసిరిలోని క్రోమియం శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను నిరోధిస్తుంది.రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. రోగనిరోధక శక్తిని, జీవక్రియను పెంచడానికి సహాయపడుతుంది. జలుబు, దగ్గుతో సహ వైరల్, బ్యాక్టీరియా వ్యాధులను నివారిస్తుంది. గుండె జబ్బుల్ని తగ్గిస్తుంది. బిపి రోగులు రోజు ఒక ఉసిరికాయ తింటే తగ్గుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉసిరికాయ మురబ్బా లేదా రసాన్ని కలిపి రోజుకు రెండు, మూడు సార్లు తీసుకుంటే జీర్ణకోశవుల్లోని నులిపురుగులు, బద్దె పురుగులు, కొంకి పురుగులు, ఏలిక పాములు వంటివి నశిస్తాయి. అలసట, నీరసం వంటివి తగ్గుతాయి. ఉసిరికాయ రసం–తేనె కలిపి ప్రతిరోజూ ఉదయం పూట తీసుకుంటుంటే ఉబ్బసము, స్కర్వీ వ్యాధి, రక్తహీనత (ఎనీమియా) వంటివి తగ్గుతాయి. సాధారణ జలుబు, జ్వరం, అలసట వంటివి ఉన్నవారు కూడా ఈ మిశ్రమాన్ని ప్రతిరోజూ ఉదయం తీసుకుంటూ ఉంటే వాటిని తగ్గించొచ్చు.



విజయవాడలో జెడి చక్రవర్తి సందడి

ప్రముఖ నటుడు జెడి చక్రవర్తి నటించిన దయా (డిస్నీం హాట్స్టార్ ఒటిటిఇ కొత్త తెలుగు క్రైమ్ థ్రిల్లర్) వస్తోంది. విజయవాడలోని పివిపి మాల్‌లో పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రేక్షకులతో సంభాషించారు. అభిమానులతో సరదాగా మాట్లాడుతూ, సెల్ఫీలు దిగుతూ ఆహ్లాదకరమైన క్షణాలను పంచుకున్నారు. దయా కథ, టైటిల్ క్యారెక్టర్ చుట్టూ తిరుగుతుంది. ఫ్రీజర్ వ్యాన్ డ్రైవర్ తన వ్యాన్ లోపల నిర్జీవమైన శరీరాన్ని కనుగొన్నప్పుడు అతని జీవితం ఊహించని మలుపు తిరుగుతుంది. ఈ వెబ్ సిరీస్లో జెడి చక్రవర్తి, ఈషా రెబ్బా, రమ్య నంబేసన్, విష్ణుప్రియ, కమల్ కామరాజ్, ఇతర ప్రముఖ నటీనటులు నటించారు.

9న ఖుషి ట్రైలర్



శివ నిర్వాణ దర్శకత్వంలో సమంత, విజయ్ దేవరకొండ నటించిన 'ఖుషి' సినిమా సెప్టెంబర్ 1న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతుంది. హేషమ్ అబ్దుల్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కింది. సినిమా విడుదలకు సమయం దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. ఈ క్రమంలో ట్రైలర్‌పై తాజాగా చిత్ర యూనిట్ ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్‌ను అందించారు. ఆగస్టు 9న సినిమా ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నారు. ఈ ట్రైలర్ 2 నిమిషాల 41 సెకన్ల నిడివి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా సమంత, విజయ్ దేవరకొండ కనిపిస్తున్న ఓ పిక్‌ను కూడా అభిమానులతో పంచుకున్నారు.

కొత్త ప్రపంచాన్ని చూస్తారు



'కల్కి షూటింగ్ ఇంకా కొంచెం మిగిలి ఉంది. దానిని కూడా త్వరలోనే కంప్లీట్ చేస్తాం. ప్రస్తుతం నా ఫోకస్ మొత్తం దానిపైనే ఉంది. అది పూర్తయ్యాక విడుదల తేదీ గురించి ఆలోచిస్తాం. ఒక మంచి రోజు చూసుకుని దీని గురించి ప్రకటిస్తాను. ఈ సినిమాలో అందరూ ఓ కొత్త ప్రపంచాన్ని చూస్తారు. ఇప్పటివరకు ప్రభాస్ ఇలాంటి లుక్‌లో కనిపించలేదు. అందుకోసమైనా ఆడియన్స్ ఈ మూవీ కచ్చితంగా చూడాలి. థియేటర్‌కు వచ్చిన వారంతా కొత్త అనుభూతి పొందుతారు' అంటూ తాజాగా ఓ ప్రముఖ మీడియా ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగ్ అశ్విన్, ప్రభాస్ నటిస్తున్న 'ప్రాజెక్ట్ కల్కి' సినిమా విశేషాలు మాట్లాడారు. ఈ సందర్భంగా గత కొంతకాలంగా ఈ సినిమా గురించి వస్తున్న వార్తలపై కూడా స్పందించారు. ఈ సినిమాను రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారని.. మొదటి పార్ట్‌ను మే 9న రిలీజ్ చేయనున్నారని టాక్ నడుస్తోంది. అలాగే వీఎఫ్ఎక్స్ వర్క్ సైతం చాలా సమయం తీసుకోనుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు.

ఉద్యోగులకు జైలర్ సెలవులు



సూపర్ స్టార్ రజినీకాంత్, తమన్నా జంటగా నటించిన చిత్రం 'జైలర్'. ఈ చిత్రం 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. చెన్నై, బెంగళూరులోని అనేక ఆఫీసులకు 10న సెలవు ప్రకటించారు. యూనో ఆక్వా కేర్ అనే కంపెనీ ఉద్యోగులకు సెలవు ఇవ్వడంతో పాటు మూవీ టికెట్లు కూడా బుక్ చేస్తోందట. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రంలో బాలీవుడ్ నటులు సంజయ్ దత్, జాకీష్రాఫ్, శాండిల్ ఉడ్‌స్టార్ నటుడు శివరాజ్ కుమార్, టాలీవుడ్ నటుడు సునీల్, వసంత రవి, రమ్యకష్ణ వంటి నటీనటులు ముఖ్యపాత్రలు పోషించారు.



కార్తికికి లీగల్ నోటీస్

ఆస్కార్ విజేత, 'ది ఎలిఫెంట్ విష్పరర్స్' దర్శకురాలు కార్తికి గోంజాల్వేస్‌కు బొమ్మన్ – బెల్లీ దంపతులు రూ.2 కోట్ల లీగస్ నోటీస్‌ను పంపించారు. ప్రాజెక్ట్ చిత్రీకరించే సమయంలో అన్ని విధాలుగా సాయం చేస్తానంటూ కార్తికి మాటిచ్చిందని, ఇప్పటికీ వాటిని నెరవేర్చలేదని నోటీసులో వారు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇల్లు, వాహనం, బెల్లీ మనవరాలు చదువుకు కావాల్సిన సాయంతోపాటు సినిమాలో నటించినందుకు గానూ కలెక్షన్స్ నుంచి కొంత మొత్తాన్ని ఇస్తానని కార్తికి తమకు చెప్పారని, అయితే ఆమె ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని అన్నారు.

విజయ్ రాఘవేంద్ర సతీమణి మృతి



కన్నడ నటుడు విజయ్ రాఘవేంద్ర సతీమణి స్పందన హఠాన్మరణం చెందారు. మూడు రోజుల క్రితం బ్యాంకాక్ వెళ్లిన ఆమె సోమవారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. దీంతో, విజయ్ ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. కర్ణాటక ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సైతం విజయ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బెంగళూరుకు చెందిన పోలీస్ అధికారి బీకే శివరామ్ కుమార్తె స్పందన. 2007లో ఆమెకు నటుడు విజయ్ రాఘవేంద్రతో వివాహమైంది. వీరికి శౌర్య అనే కుమారుడు ఉన్నాడు. 2016లో విడుదలైన 'అపూర్వ' అనే కన్నడ సినిమాలోనూ స్పందన నటించారు. ఇటీవల స్నేహితులతో కలిసి టూర్‌కు వెళ్లిన ఆమె.. సోమవారం ఉదయం గుండెలో నొప్పిగా ఉందని సహచరులకు చెప్పినట్లు తెలుస్తోంది. ఆస్పత్రికి తరలించేలోపే ఆమె కన్నుమూసినట్లుగా సమాచారం.

రేసులో నిలవాలంటే గెలవాల్సిందే..!

- జైస్వాల్ ఇన్.. సంజు ఔట్..
- నేడు విండీస్‌తో మూడో టి20
- రాత్రి 8.00గం||లకు



గయానా: వెస్టిండీస్‌తో మంగళవారం జరిగే మూడో టి20కి యువ క్రికెటర్ జైస్వాల్ చోటు దక్కించుకున్నాడు. వికెట్ కీపర్, బ్యాటర్ సంజు శాంసన్ స్థానంలో అతడికి తుది జట్టులో చోటు దక్కింది. తొలి రెండు టి20ల్లో ఓటముల నేపథ్యంలో టీమిండియా కాంబినేషన్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. బ్యాటింగ్ లైనప్‌తో ఆ రెండు టి20ల్లో ఓడిన నేపథ్యంలో పేలవఫామ్‌లో ఉన్న సంజుపై తొలి వేటు పడింది. తిలక్ వర్మ మినహా మరే ఆటగాడు కూడా స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చడం లేదు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్ కూడా దారుణంగా విఫలమౌతున్నారు. దీంతో యువ ప్లేయర్ యశస్వీ జైస్వాల్‌కు చోటు దక్కింది. విండీస్ గడ్డపై టెస్ట్‌ల్లో అరంగేట్రం చేసిన జైస్వాల్..సెంచరీతో చెలరేగాడు. మూడు మ్యాచ్‌ల్లో అదే జోరును కొనసాగించాడు. ఈ క్రమంలోనే అతన్ని తుది జట్టులోకి తీసుకోవాలని మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు. అయితే జైస్వాల్‌ను తుదిజట్టులో చోటు దక్కితే ఓపెనర్ల కాంబినేషన్‌కు తీవ్ర పోటీ నెలకొననుంది. ఈ క్రమంలో గిల్, ఇషాన్, జైస్వాల్‌లలో ఒకరిని ఫస్ట్ డౌన్‌కు పంపాల్సి ఉంటుంది. శుభ్‌మన్ గిల్‌ను ఫస్ట్ డౌన్‌కు పంపాలని భావిస్తే ఓపెనర్లుగా ఇద్దరూ లెఫ్టాండర్లే కానున్నారు. టి20ల్లో ప్రపంచ నెంబర్ వన్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్‌ను పక్కనపెడితే విమర్శలు వచ్చే అవకాశం ఉంది. రెండు మ్యాచ్‌ల్లోనూ సూర్య దురదృష్టవశాత్తు ఔటయ్యాడు. ఈ పరిస్థితుల్లో టీమిండియా మేనేజ్‌మెంట్‌కు ఉన్న ఏకైక ఆప్షన్ సంజూ శాంసన్. లేదంటే పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న శుభ్‌మన్ గిల్‌ను పక్కనపెట్టి సూర్యతో యశస్విని ఓపెనింగ్ చేయించ డమే. లేదంటే ఇషాన్ కిషన్‌ను మిడిలార్డర్‌లోకి పంపించి గిల్‌తో కలిసి యశస్వి ఓపెనింగ్ చేయాల్సి ఉంటుంది.

ఏది ఏమైనా మూడో టీ20లో యశస్వి జైస్వాల్‌కు చోటు దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే తుది జట్టులో మార్పులు చేయకుండా బరిలోకి దిగాలని హార్దిక్ పాండ్యా భావిస్తే మాత్రం అతనికి మరోసారి నిరాశే ఎదురుకానుంది. కుల్దీప్ గాయం నుంచి కోలుకుంటే జట్టులోకి వస్తాడు. అప్పుడు బిష్ణోయ్ ఉద్వాసనకు గురవుతాడు. ముకేష్ కుమార్‌ను స్థానంలో ఉమ్రాన్, ఉనాద్కట్ ఒకరు తుది జట్టులోకి రానున్నారు.

జట్టు(అంచనా): **జైస్వాల్, శుభ్‌మన్, సూర్యకుమార్, తిలక్ వర్మ, ఇషాన్, హార్దిక్, అక్షర్, బిష్ణోయ్, అర్ష్‌దీప్, ముకేష్, చాహల్/ఉనాద్కత్.**

పాకిస్తాన్ సెలెక్టర్‌గా ఇంజమామ్



లాహోర్: పాకిస్తాన్ పురుషుల క్రికెట్‌జట్టు సెలెక్టర్‌గా మాజీ క్రికెటర్ ఇంజమామ్–ఉల్–హక్ ఎంపికయ్యాడు. పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు(పిసిబి) సోమవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. అతడు తక్షణమే బాధ్యతలను అందుకోనున్నట్లు, ఆసియాకప్, ఐసిసి వన్డే ప్రపంచకప్‌లకు అతడే జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపింది. 2016–19లో ఓసారి ఈ పదవిని అలంకరించిన 53ఏళ్ల ఇంజమామ్ రెండోసారి సెలెక్టర్‌గా ఎంపికయ్యాడు.

టాప్‌లో భారత్

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ



చెన్నై: ఆసియా ఛాంపియన్స్‌ట్రోఫీ హాకీలో భారత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. మంగళవారం జరిగిన నాల్గవ లీగ్ మ్యాచ్‌లో భారత్ 3–2 గోల్స్ తేడాతో దక్షిణ కొరియాను చిత్తుచేసింది. తొలి రెండు క్వార్టర్స్ ముగిసే సరికి భారత్ 2–1గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. తొలి గోల్‌ను నీలకంఠ శర్మ(6వ ని.) చేయగా.. 2వ గోల్‌ను 2వ క్వార్టర్ 23వ ని.లో హర్మన్‌ప్రీత్ సింగ్ చేశాడు. మూడో క్వార్టర్ 33వ ని.లో మన్‌దీప్ సింగ్ ఒక గోల్ చేయడంతో భారత్ 3–2 గోల్స్ ఆధిక్యతను సంపాదించింది. ఇక కొరియా తరపున కిమ్–సుంగ్‌యంగ్(12వ ని.)లో, జిహున్ యగ్(58వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. ఈ గెలుపులో పాయింట్ల పట్టికలో భారత్ 9పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా.. మలేషియా కూడా 9 పాయింట్లతో భారత్‌తో సమంగా నిలిచింది. 9న జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు పాకిస్తాన్‌తో తలపడనుంది. నేడు జరిగిన మరో లీగ్ మ్యాచ్‌లో పాక్ జట్టు 2–1గోల్స్ తేడాతో చైనాను చిత్తుచేసింది. మహ్మద్ ఖాన్(19వ ని.), అఫ్రాజ్ గోల్(39వ ని.) ఒక్కో గోల్ చేయగా.. చైనా ప్లేయర్ జిషెంగ్ జియో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు.

క్వార్టర్స్‌కు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా

ఫిఫా మహిళల ప్రపంచకప్

సిడ్నీ: ఫిఫా మహిళల ప్రపంచకప్ క్వార్టర్‌ఫైనల్లోకి ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లు ప్రవేశించాయి. మంగళవారం జరిగిన ప్రి క్వార్టర్స్ పోటీల్లో ఇంగ్లండ్ మహిళలజట్టు పెనాల్టీ షూటౌట్‌లో నైజీరియాపై, ఆస్ట్రేలియా జట్టు డెన్మార్క్‌పై విజయం సాధించాయి. ఇంగ్లండ్–నైజీరియా జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో నిర్ణీత, అదనపు సమయం పూర్తయ్యేసరికి ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో ఫలితం కోసం పెనాల్టీ షూటౌట్‌లకు నిర్దేశించగా ఇంగ్లండ్ జట్టు 4–2గోల్స్ తేడాతో నైజీరియాను చిత్తుచేసింది. మరో పోటీలో ఆస్ట్రేలియా జట్టు 2–0గోల్స్ తేడాతో డెన్మార్క్‌ను ఓడించింది. ఆస్ట్రేలియా తరపున కల్టిన్ ఫోర్డ్(29వ ని.), హైలీ రాసో(70వ ని.లో) ఒక్కో గోల్ కొట్టారు. నేడు కొలంబియా–జమైకా, ఫ్రాన్స్–మొరాకో జట్ల మధ్య చివరి ప్రి క్వార్టర్స్ మ్యాచ్ జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68